శుక్రవారం
19-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 359
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లెట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

అదానీ వీడియోల తొలగింపునకు ఢిల్లీ కోర్టు బ్రేక్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్)పై వీడియోలు, పోస్టులు వెంటనే తొలగించాలని ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ జిల్లా కోర్టు గురువారం నిలిపివేసింది. సివిల్ కోడ్ (సీపీసీ) నిబంధనలను దృష్టిలో పెట్టుకొని ప్రతివాదులకు కనీసం తమ పక్షాన్ని ఉంచేందుకు సివిల్ జడ్జి అవకాశం ఇచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడింది. ఈ అభ్యంతర కర ఆదేశాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అప్పీల్‌కు అవకాశం ఇస్తున్నానన్నారు. ఇదే వ్యవహారంలో జర్నలిస్టు పరన్‌జయ్ గుహా ఠాకుర్త పిటిషన్‌పై వేరొక కోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది.

సింగిల్ లాగిన్‌తో ఈపీఎఫ్ సేవలు

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. మెంబర్ పోర్టల్‌లోనే పీఎఫ్ లావాదేవీలు తెలుసుకునేలా పాస్‌బుక్ లైట్ పేరుతో కొత్త సదుపాయం తీసుకొచ్చింది. పాస్‌బుక్ కోసం ప్రత్యేకంగా లాగిన్ అయ్యే అవసరాన్ని తగ్గించింది. ఇకపై సింగిల్ లాగిన్‌తోనే ఈపీఎఫ్ఓకు సంబంధించిన అన్ని సేవలూ, పీఎఫ్ ఖాతా వివరాలు తెలుసుకోవచ్చని కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ సేవల కోసం ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌ను తెరవాల్సి ఉంటుంది. ఈపీఎఫ్ ఖాతా

- మిగతా 2 లో

విశాఖ-హైదరాబాద్ విమానానికి తప్పిన ప్రమాదం

విశాఖపట్నం: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి పెద్దప్రమాదం తప్పింది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 2.38 గంటలకు ఎయిరిండియా విమానం హైదరాబాద్ బయలుదేరింది. కొంత దూరం వెళ్లాక విమానం రెండో ఇంజిన్‌లో పక్షి ఇరుక్కుంది. దీంతో అప్రమత్తమైన పైలట్ చాకచక్యంగా వ్యవహరించి మూడు గంటల సమయంలో విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ల్యాండ్ చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఎయిర్ ఇండియా యాజమాన్యం ఏర్పాట్లు చేసింది.

ఓట్ల దొంగలకు ఈసీ అండ

ప్రజాస్వామ్యం ఖూనీ

- వ్యవస్థీకృతంగా ఓట్ల దొంగతనం
- కర్నాటకలోని అలంద్‌లో 6 వేలకు పైగా ఓట్ల తొలగింపు యత్నం
- సెంట్రల్ సాఫ్ట్‌వేర్ సాయంతో ఓట్ల చోరీ
- రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- ఆధారాలు, బాధితులతో మీడియా ముందుకు వచ్చిన ప్రతిపక్షనేత
- ఇది ఆరంభం మాత్రమే... త్వరలో 'హైడ్రోజన్ బాంబ్' పేలుస్తానని వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో వ్యవస్థీకృతంగా 'ఓట్ల దొంగతనం' జరుగుతోందని, ఈ కుట్రకు పాల్పడుతున్న వారిని సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కాపాడుతున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓటర్ల జాబితా నుంచి పేర్లను ఎలా తొలగిస్తున్నారో ఆధారాలతో సహా ఎల్ఈడీ స్క్రీన్‌పై వివరించారు. సెంట్రల్ సాఫ్ట్‌వేర్ సాయంతో లక్షలాది మంది పౌరుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తాను పక్కాగా 100 శాతం ఆధారాలతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నట్లు వెల్లడించారు. కొందరు బాధితులను మీడియా ముందు రాహుల్ గాంధీ ప్రవేశపెట్టడం విశేషం. ఓట్లు తొలగించేందుకు కొందరు వ్యక్తులు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారని, ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోందని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే లక్షల మంది ఓట్లు తొలగిస్తున్నారని, చాలాచోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లు తొలగించారని తెలిపారు. ఇవన్నీ ఆరోపణలు కాదని, పక్కా ఆధారాలతోనే చెబుతున్నానని స్పష్టం చేశారు. కర్నాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అలంద్ నియోజకవర్గంలో జరిగిన ఘటనను ఆయన ఉదాహరణగా చూపించారు. అక్కడ ఏకంగా 6,018 ఓట్లను అక్రమంగా తొలగించేందుకు ప్రయత్నం జరిగిందన్నారు. 'ఇది అనుకోకుండా బయటపడిన ఒక ఉదంతం మాత్రమే. అలంద్‌లో మొత్తం ఎన్ని ఓట్లు తొలగించారో మాకు తెలియదు. కానీ 6,018 ఓట్ల తొలగింపు వ్యవహారం మాత్రం పట్టుబడింది' అని రాహుల్ తెలిపారు. ఈ కుట్ర ఎలా బయటపడిందో వివరిస్తూ 'ఒక బూత్ లెవెల్ అధికారి తన బంధువు పేరు ఓటర్ల జాబితాలో కనిపించకపోవడంతో ఆరా తీశారు. ఆమె బంధువు ఓటును ఒక పొరుగు వ్యక్తి దరఖాస్తు ద్వారా తొలగించినట్లు రికార్డుల్లో ఉంది. ఆ పొరుగు వ్యక్తిని అడగ్గా, తనకేమీ తెలియదని, తాను ఏ దరఖాస్తు చేయలేదని చెప్పారు. అంటే, ఓటు తొలగించిన వ్యక్తికి తెలియదు, ఓటు పోగొట్టుకున్న వ్యక్తికీ తెలియదు. మధ్యలో మరేదో శక్తి ఈ ప్రక్రియను హైజాక్ చేసి ఓట్లను తొలగించింది. ఆటోమేటెడ్ సెంట్రల్ సాఫ్ట్‌వేర్ సాయంతో ఇదంతా చేస్తున్నారు' అని రాహుల్ వివరించారు. కర్నాటక అలంద్‌లో గోదాబాయి అనే మహిళ పేరుతో ఫేక్ లాగిన్ సృష్టించారన్న రాహుల్... ఆమె మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. రాహుల్ వేదికపైకి సూర్యకాంత్, బబితా చౌదరి అనే ఇద్దరు

- మిగతా 2 లో

ఆన్‌లైన్ ద్వారా ఓట్ల తొలగింపు అసాధ్యం: ఈసీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన ఓట్ల చోరీ ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఓట్లను ఆన్‌లైన్ ద్వారా తొలగించటం అసాధ్యమన్న ఈసీ...ఆయన చేసిన

- మిగతా 2 లో

యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్

ఏఐ టెక్నాలజీకి గ్లోబల్ సెంటర్
'యుఎక్స్ ఇండియా' సదస్సులో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్‌ను నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. యుఎమ్ఓ ఫౌండేషన్ అధ్వర్యంలో గురువారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్లో "యుఎక్స్ ఇండియా 25" పేరిట ఏర్పాటు చేసిన 21వ "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్‌పీరియన్స్-ప్రొడక్ట్ డిజైన్" ను ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్ గ్లోబల్ సెంటర్‌గా నిలబెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు క్యాబినెట్ పట్టుదలతో ఉందన్నారు. రాష్ట్రంలో టెక్నాలజీ రంగంలో గుర్తించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రతినిధులను కోరారు. డిజైన్ అనేది కేవలం అందానికి కాదు అది సామాజిక మార్పునకు ఆయుధం కావాలి అని ఉద్బోధించారు. హైదరాబాదును ప్రపంచ డిజైన్ క్యాపిటల్‌గా మార్చడానికి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర డిజిటల్ భవిష్యత్తును పరిపుష్టి చేయడంలో మరో అడుగు ముందుకు వేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్లు మన జీవితాల్లో అనివార్యమైనవి, కానీ ఒక యాప్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటేనే అది విజయవంతం అవుతుంది అన్నారు. తెలంగాణ ప్రభుత్వం... టీఎస్ -ఐపాస్ వంటి పాలసీల ద్వారా స్టార్టప్‌లకు చేయూతనిస్తుంది అని తెలిపారు. భారతదేశంలో యూపీఐ వంటి యాప్‌లు సరళంగా రూపొందించడంతో పెద్ద విజయం సాధించాయన్నారు. ప్రాంతీయ భాషల్లోనూ యాప్‌లు రూపొందించడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా సులభంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది అన్నారు.

త్వరలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్: మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్‌ను గ్లోబల్ డిజైన్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్"ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్

- మిగతా 2 లో

జీతాలు యథాతథం

కూనంనేని చొరవతో పరిష్కారం
ఊపిరి పీల్చుకున్న మైనారిటీ గురుకుల అధ్యాపకులు



విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: అంతంత మాత్రం జీతభత్యాలతో పనిచేసే మైనారిటీ గురుకుల ఉపాధ్యాయులు, లెక్చరర్ వేతనాల్లో కోత విధిస్తూ పిడుగు లాంటి ఆదేశం విడుదలైంది. దీంతో గురువారం రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఉద్యమించారు. కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. మూడు నెలల నుంచి జీతాలు రాక ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల జీతాలను కోత విధించేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈనెల 15న జీవో 1437 విడుదల చేశారు. ఈ ఆర్డర్ వస్తుందని జిల్లాల ముఖ్య అధికారులకు సైతం తెలియకపోవడం గమనార్హం. మూడు నెలల తరువాత బుధవారం జీతాలు అందుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కంగుతిన్నారు. రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కోత విదించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఆరు గురుకులాలకు చెందిన 100 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా డీఎండబ్ల్యూఓగా ఉన్న సంజీవరావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. జీవో 1437 రద్దునకు డిమాండ్ చేశారు. జీతాల్లో తగ్గించిన మొత్తాలు ఇవ్వాలని కోరారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్య గురించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకుడు ఎస్ఏ రబ్ తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోనే ఉన్న కూనంనేని వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడారు. మైనార్టీ గురుకులాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే ఉద్యోగుల జీతాల్లో ఇంత మొత్తం కోత విధించడం సబబు కాదని సూచించారు. రాష్ట్ర అధికారులతోనూ ఆయన మాట్లాడారు. దీంతో సీఎస్ సందీప్ కుమార్ స్పందించి సాయంత్రానికి మరో జీవో విడుదల చేశారు. ఉద్యోగులకు యథావిధిగా జీతభత్యాలు ఉంటాయని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే కూనంనేనికి కృతజ్ఞతలు తెలిపారు.

దంచుడే...దంచుడు

- భారీ వర్షాలకు హైదరాబాద్ అతలాకుతలం
- పంజాగుట్ట నుంచి సెక్రటేరియట్ వరకు కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- చెరువుల్ని తలపించిన రహదారులు
- నగరవాసులకు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర-హైదరాబాద్: భాగ్యనగరాన్ని వర్షం వీడటం లేదు. అకాల వర్షాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి. సాయంత్రం వేళల్లో మొదలవుతున్న ఈ భారీ వర్షాలు నగరాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. బుధవారం కురిసిన కుండపోత వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రం మళ్లీ ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిగా నగరంలోని వివిధ ప్రాంతాల్ని వర్షం ముంచెత్తడంతో నగరవాసులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, ఫలక్‌నుమా, బార్కస్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వరదనీటితో రోడ్లు చెరువులను తలపించాయి. పంజాగుట్ట మోడల్ హౌస్ ముందు రహదారి చెరువులా మారిపోయింది. మోకాలి లోతు నీరు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమాజిగూడ సర్కిల్‌కు ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు వరదలా రావడంతో ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. మరోవైపు సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, గుండ్లపోచంపల్లి, సూరారం, జీడిమెట్ల, చింతల్, షాపూర్ నగర్, గాజుల రామారం, జగద్గిరిగుట్ట, బాలానగర్ తదితర ప్రాంతాలనే వర్షం ముంచెత్తింది. విస్తారంగా కురుస్తున్న వానలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షంతో స్కూళ్లు, కళాశాలలు, ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి అవస్థలు పడ్డారు.

సికింద్రాబాద్‌లో భారీ వర్షం

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రైల్వే స్టేషన్, ప్యాట్నీ, ప్యారడైస్, బేగంపేట, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, మారేడుపల్లి, సీతాఫల్‌మండి ప్రాంతాల్లో భారీ వర్షానికి రహదారులు నీటమునిగాయి. మనోహర్ థియేటర్ సమీపంలో రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు, ఆఫీస్‌ల

- మిగతా 2 లో

ఈడీ రంగ ప్రవేశం

- ఐదు రాష్ట్రాల్లో విస్తృత తనిఖీలు
- పోలీస్ కస్టడీకి ఎంపీ మిథున్‌రెడ్డి
- మద్యం కేసులో కీలక పరిణామం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.3,500 కోట్ల మేర జరిగిన మద్యం కుంభకోణంలో తాజాగా కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు ఈ కేసును సిట్ మాత్రమే దర్యాప్తు చేస్తుండగా... గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగ ప్రవేశం చేసింది. ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులకు సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్నాటక, ఢిల్లీలోని వారి సంస్థలు, కార్యాలయాల్లో ఈడీ విస్తృత తనిఖీలు చేపట్టింది. ఐదు రాష్ట్రాల్లోని దాదాపు 20 ప్రాంతాల్లో సుమారు 10 బృందాలు ఏకకాలంలో ఈ సోదాలు జరిపాయి. ఇప్పటికే ఈ కేసులో అనేకమందిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రాథమికంగా రూ.3,500 కోట్ల మేర స్కామ్ జరిగిందంటూ సిట్ అధికారులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇప్పుడప్పుడే ఇందులోంచి లేచేలా లేడే!

పిల్లలకు సురక్షిత నగరం

యునిసెఫ్‌తో కలిసి మంత్రులు సీతక్క, పొన్నం కార్యాచరణ

విశాలాంధ్ర - హైదరాబాద్: "క్లాప్ ఫర్ చిల్డ్రన్" పిల్లల భద్రత కోసం నగర స్థాయి కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం, యునిసెఫ్ సంయుక్తంగా గురువారం ప్రారంభించింది. హైదరాబాద్‌ను పిల్లలకు సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- మిగతా 2 లో

అదానీకి సెబీ క్లీన్‌చిట్

హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాల్లేవని వెల్లడి

న్యూఢిల్లీ: ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ, ఆయన కంపెనీలకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) క్లీన్ చిట్ ఇచ్చింది. అదానీ కంపెనీపై అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవంది. అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలను హిండెన్‌బర్గ్ రుజువు చేయలేకపోయిందని... అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీల్లోకి అక్రమంగా నిధులు మళ్లించిందనడానికి ఎలాంటి ఆధారాల్లేవని పేర్కొంది. ఈ మేరకు

- మిగతా 2 లో

బతుకమ్మ, దసరాకు 7,754 ప్రత్యేక బస్సులు

- 20 నుంచి అక్టోబరు 2 వరకు
- 377 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం
- ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం: ఎండీ సజ్జనార్

విశాలాంధ్ర - హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండుగలకు రవాణా ఇబ్బందులు ప్రజలకు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 7,754 ప్రత్యేక బస్సులు నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. వీటిలో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబరు రెండో తేదీన దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. తిరుగు ప్రయాణానికి అక్టోబరు ఐదు, ఆరు తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్ తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్ బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం

- మిగతా 2 లో

డ్రగ్స్ స్థావరాలుగా 23 దేశాలు

అమెరికా ప్రజల భద్రతకు ముప్పు : ట్రంప్

వాషింగ్టన్: డ్రగ్స్‌కు రవాణా స్థావరాలుగా భారత్‌తో సహా 23 దేశాలు వ్యవహరిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. భారత్‌తోపాటు అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, చైనాలు ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్‌ను అందులో ఉపయోగించే రసాయనాలను ఉత్పత్తి చేస్తూ అమెరికా ప్రజల భద్రతకు ముప్పుగా మారాయని విమర్శించారు. అమెరికన్ కాంగ్రెస్‌కు సమర్పించిన 'ప్రెసిడెన్షియల్ డిటర్మినేషన్' నివేదికలో డొనాల్డ్ ట్రంప్ ఈ విధంగా ఆరోపించారు. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, చైనా, అఫ్గానిస్థాన్, ద బహామాస్, బెలీజ్, బొలీవియా, బర్మా, కొలంబియా, కోస్టారికా, ద డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, హైతీ, హొండురస్, జమైకా, లావోస్, మెక్సికో, నికరాగువ, పనామా, పెరూ, వెనిజులా దేశాలు ఉన్నాయి. ఇవి ప్రధానంగా డ్రగ్స్‌ను ఉత్పత్తి చేయడంతోపాటు రవాణా చేస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ 23 దేశాలు అక్రమ మాదక ద్రవ్యాలను అమెరికాలోకి రవాణా, ఉత్పత్తి చేయడానికి బాధ్యులుగా గుర్తించామని శ్వేతసౌధం ఓ ప్రకటనలో తెలిపింది.

ట్రంప్ స్వర్ణ విగ్రహం

అమెరికా క్యాపిటల్ భవనం వెలుపల ఏర్పాటు

వాషింగ్టన్: అమెరికాలో గురువారం రెండు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసేలా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించగా... మరోవైపు అదే సమయంలో అమెరికా క్యాపిటల్ భవనం వెలుపల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ స్వర్ణ విగ్రహం వెలవడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ విగ్రహం 12 అడుగుల ఎత్తు ఉండగా... ట్రంప్ తన చేతిలో ఒక బిట్‌కాయిన్‌ను పట్టుకుని ఉన్నట్లు రూపొందించారు. దీనిని క్రిప్టోకరెన్సీ ఇన్వెస్టర్లు ఏర్పాటు చేసినట్లు ఏబీసీ అనుబంధ సంస్థ డబ్ల్యూజేఎల్‌ఏ వెల్లడించింది. డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, దేశ ద్రవ్య విధానం, ఆర్థిక మార్కెట్లలో ప్రభుత్వ జోక్యం వంటి అంశాలపై విస్తృత చర్చను రేకెత్తించేందుకే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. క్రిప్టోకరెన్సీకి ట్రంప్ బహిరంగంగా మద్దతు పలికినందుకు గౌరవసూచకంగా కూడా దీనిని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుతో ఆ ప్రాంతంలో జనసందోహం నెలకొంది. ఇదే సమయంలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25శాతం) తగ్గించింది. గతేడాది డిసెంబర్ తర్వాత వడ్డీ రేట్లను తగ్గించడం ఇదే తొలిసారి. ఈ నిర్ణయంతో స్వల్పకాలిక వడ్డీ రేటు 4.3 శాతం నుంచి సుమారు 4.1 శాతానికి దిగివచ్చింది. ఈ ఏడాది మరో రెండుసార్లు, 2026లో ఒకసారి వడ్డీ రేట్ల కోత ఉండే అవకాశం ఉందని ఫెడ్ సంకేతాలు ఇచ్చింది. గతంలో ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్‌పై, ఆయన విధానాలపై ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే.

పాక్-సౌదీ వ్యూహాత్మక రక్షణ ఒప్పందం

రియాద్: పశ్చిమాసియా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్లామిక్ దేశాలైన పాకిస్థాన్, సౌదీ అరేబియా వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ మేరకు సౌదీ రాజధాని రియాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం, ఈ రెండు దేశాల్లో ఏ ఒక్కరిపైనా బయటి శక్తులు దాడి చేసినా, దానిని తమ ఇద్దరిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సౌదీ పర్యటన సందర్భంగా ఈ ఒప్పందాన్ని ఖరారైంది. అనంతరం ఇరు దేశాలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. "ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతి భద్రత లను సాధించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని పెంపొందించుకో వడంతో పాటు, ఎలాంటి దాడినైనా ఉమ్మడిగా ఎదుర్కోవడానికి ఇది దోహదపడుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల దోహాలో 40 ఇస్లామిక్ దేశాలతో జరిగిన సమావేశం తర్వాత ఈ ఒప్పందం జరగడం గమనార్హం. ఖతార్‌లో హమాస్ నేతలపై ఇజ్రాయిల్ దాడి అనంతరం, నాటో తరహాలో ఒక సైనిక కూటమిని ఏర్పాటు చేయాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఇస్లామిక్ దేశాల్లో అణ్వాయుధ సామర్థ్యం ఉన్న ఏకైక దేశం పాకిస్థాన్ కావడం ఈ ఒప్పందానికి మరింత ప్రాధాన్యతను చేకూర్చింది.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనగణనలో కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జనగణనలో కులగణన చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 14న రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలతో విజయవాడలో సమావేశం నిర్వహించామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థలలో గతంలో మాదిరిగా 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతూ... అందుకు అవసరమైన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నట్లు తెలుస్తోందన్నారు. పొరుగున గల తెలంగాణ ప్రభుత్వం... ఆ రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని వివరించారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈనెల 22 నుంచి అక్టోబర్ 7 వరకు కులగణన చేపట్టి... ఆమేరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ప్రకటించారని, అందుకోసం రూ.400 కోట్లు కేటాయించారని వివరించారు. రాష్ట్రంలోను ఏ ఏ కులాల జనాభా ఎంత ఉన్నది? వారి ఆర్థిక పరిస్థితులు, ఆయా కులాల వారికి ఎలాంటి సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలో జనగణనలో కులగణన చేపట్టడం వల్ల సాధ్యమవుతుందని తెలిపారు.

కండక్టర్ల కలవరం!

విశాలాంధ్ర-డిజిటల్: పొరపాటున జరిగిన చిన్న తప్పుకు అధికారులు పెద్దశిక్ష వేస్తున్నారంటూ ఆర్టీసీ కండక్టర్లు లబోదిబో మంటున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం వల్ల మహిళా ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరగడంతో గందరగోళం ఏర్పడుతోంది. దీంతో చిన్నచిన్న పొర పాట్లకు ఆస్కారం ఏర్పడుతుందని చెబుతు న్నారు. పైగా ప్రింట్...డబ్ల్యూఎఫ్‌టీ ఆప్షన్‌లు ఇంచుమించు ఒకేరంగులో ఉండడం... ఒకదానికొకటి ఆనుకుని ఉండటానికితోడు మహిళల సిగపట్ల మధ్య ఆలోచన కోల్పోయి జీరో టికెట్‌కు బదులు ప్రింట్... డబ్బులు తీసుకుని జీరో టికెట్ కొడుతుండడంతో టికెట్ చెకింగ్ స్క్వాడ్ తమను తప్పుపడుతూ సస్పెండ్ చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చు తున్నారు. నిత్యం ఎంతోకొంత సొంత సొమ్ము సంస్థకు చెల్లించాల్సి వస్తోందని మదనపడుతున్నారు. పదవీ విరమణ వయసులో కావాలని తప్పులు చేసి జీవితాన్ని ఎవరూ నాశనం చేసుకోరని, అనారోగ్యం, వయసురీత్యా తమలాంటి వారిని ప్రత్యామ్నాయ విధుల్లోకి బదిలీ చేయాలని యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు.

ఎన్నికల హామీల్లో భాగంగా ఏపీలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది తర్వాత ఆగస్టు 15న 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. ఇది మహిళా లోకానికి వరమే అయినా... బస్సు కండక్టర్లకు శాపంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని రూట్ల బస్సు ల్లోనూ ఆక్యుపెన్సీ మధ్యాహ్నం మినహా ఉదయం, సాయంత్రం 90 శాతం నుంచి వంద శాతం పైబడి ఉంటోంది. పురుషుల సీట్లను సైతం మగువలు ఆక్రమిం చేస్తున్నారు. కొన్ని సమయాల్లో పురుషులు నిలబడటానికి కూడా చోటు లభించడం లేదు. ఇటువంటి గందరగోళం నడుమ మహిళల ఆధార్‌కార్డులు పరిశీలన చేస్తూ... వారి గమ్యస్థానానికి టికెట్ ఇవ్వడం సాహసమే అవుతుందని కండక్టర్లు అంటు న్నారు. దీనికితోడు టిమ్‌లో మాడిపై... ప్రింట్...డబ్ల్యూఎఫ్‌టీ (ఉమెన్ ఫ్రీ టికెట్) ఒకదానికొకటి ఆనుకుని ఉండడం, మాడిపై, ప్రింట్ ఎరుపు రంగులో ఉండడం... డబ్ల్యూఎఫ్‌టీ గులాబి రంగులో ఎరుపు రంగునకు తీసిపోని విధంగా ఉండడం మరింత గందరగోళానికి దారితీస్తోందని చెబుతున్నారు. బస్‌లో ప్రయాణికులు సామ ర్థ్యానికి మించి ఉండడం వల్ల టికెట్‌కు డబ్బులు తీసుకుని ఒక్కోసారి ఆలోచన కోల్పోయి పొరపాటున ప్రింట్‌కు అతి దగ్గరగా ఉన్న డబ్ల్యూఎఫ్‌టీ ఆప్షన్‌పై నొక్కాల్సి వస్తోందని ఆవేదన చెందారు. ముఖ్యంగా సిటీ పరిధిలో దగ్గర దగ్గరగా బస్ స్టాప్‌లు ఉండడం, మహిళా ప్రయాణి కులు అధిక సంఖ్యలో బస్ ఎక్కుతుండడం, స్టేజ్ దాటిపోవడం, మరోవైపు టికెట్ చెకింగ్ బృందం భయంతో పొరపాట్లకు ఆస్కారం అధికంగా ఏర్పడుతుందని వెల్లడించారు. ప్రతి మహిళ ఆధార్ చెక్ చేయడానికే సమయం చాలడం లేదని మనోవేదన చెందున్నారు. అక్రమాలకు పాల్పడే చీడపురుగులను ఏరిపారేయడానికి టికెట్ చెకింగ్ స్పెషల్ స్క్వాడ్ మంచిదేనని, అదే సమయంలో పదవీ విరమణ వయసులో ఉన్న తాము కావాలని తప్పులు చేసి భవిష్యత్ నాశనం చేసుకోలేమన్న నిజాన్ని ఉన్నతాధికారులు గ్రహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళల సిగపట్లు, గందర గోళం నడుమ కొన్నిసార్లు జీరో టికెట్‌కు బదులు ప్రింట్... టికెట్ డబ్బులు తీసుకుని ప్రింట్‌కు బదులు జీరో టికెట్ కొడుతూ జేబులో డబ్బులు సంస్థకు కట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. టికెట్ చెకింగ్ స్క్వాడ్‌కు పట్టుబడితే వెంటనే సస్పెండ్ చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. అనారోగ్యం... వయస్సును పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ (ఓడీ) విధుల్లోకి బదిలీ చేయాలని కొందరు కండక్టర్లు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా... స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన నెల రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 60 మందికిపైగా కండక్టర్లను సస్పెండ్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఇంక్రిమెంట్లలో కోత, జీతం పెరుగుదలలో ప్రభావం, దశాబ్దాలపాటు నీతినిజాయతీతో పనిచేసి ప్రశాంతంగా పదవీ విరమణ చేసే సమయంలో పొరపాటున జరిగే తప్పుతో తమ జీవితంపై మాయనిమచ్చ పడుతుందని కండక్టర్లు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఉత్సాహంగా విధులకు వెళ్లేవారమని, నేడు 'స్త్రీ శక్తి' తమను నిస్సత్తువ చేస్తుందని కన్నీటిపర్యంతమవుతున్నారు.

దంచుడే...దంచుడు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడ్డారు. ఏకధాటిగా కురిసిన వర్షంతో రహదారులపై చేరుతున్న వరదనీటితో రోడ్లు చెరువులను తలపించాయి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖల వారు రహదారులపై నీటిని డ్రెయిన్లలోకి పంపే చర్యలు చేపట్టారు.

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు...

భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ట్రాఫిక్, హైడ్రా బృందాలు పర్యవేక్షణ చేపట్టగా... ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు. బుధవారం నుంచి దంచికొడుతున్న వర్షాలతో హైదరాబాద్ అతలాకుతలమైంది. ఆఫీసుల నుంచి వాహనదారులు ఒకేసారి కాకుండా విడతల వారీగా రావాలని అధికారులు సూచించారు. వరదనీటితో నాలాలు పొంగిపొర్లుతున్నాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో 3 రోజుల పాటు తేలికనుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

నీట మునిగిన ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటన

నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అమీర్‌పేట్, మాదాపూర్, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్... పైనుండి వస్తున్న భారీ వరదతో మైత్రివనం వెనుక ఉన్న గాయత్రీ నగర్‌కి వరద ముప్పు ఉన్నట్లు గుర్తించారు. మైత్రివనం వద్ద చేసినట్లుగానే గాయత్రి నగర్‌లో కూడా నాలాల్లో వ్యర్థాలు తొలగించాలని స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. నాలాల్లో పూడిక తీసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు హైడ్రా కమిషనర్ హామీ ఇచ్చారు. దుర్గం చెరువులో నీటిమట్టం తగ్గించడంతో కొంతమేర పరిసర కాలనీలకు ముంపు సమస్య తీరనున్నట్లు హైడ్రా కమిషనర్ గుర్తించారు. క్లౌడ్ బరస్ట్ కారణంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్ల పైగా వర్షం పడడంతో ఇబ్బందులు తలెత్తాయని హైడ్రా ఆయన పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాగ్ లింగంపల్లిలో నీట మునిగిన శ్రీరామ్ నగర్ కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్... కాలనీ నుంచి వరద నీటిని త్వరగా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈడీ రంగ ప్రవేశం

(మొదటిపేజీ తరువాయి)

నిగ్గు తేల్చారు. సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప (ఏ-33), పైలా దిలీప్ (ఏ-30) బెయిల్‌పై బయటకు రాగా... ఎంపీ మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు సహా 8 మంది ఇంకా జైల్లోనే ఉన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో మద్యం కుంభకోణానికి సంబంధించి మరింత సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ఈడీ రంగ ప్రవేశం చేయడం కీలక పరిణామంగా మారింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి ఆస్తులపైనా ఈడీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మద్యం క్రయవిక్రయాల వ్యవహారంలో పొందిన ముడుపులను షెల్ కంపెనీలకు పంపి... నల్ల ధనాన్ని వైట్‌గా మార్చారంటూ ఇప్పటికే రాజ్ కసిరెడ్డిపై సిట్ నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించి సిట్ నుంచి ఈడీ సీనియర్ అధికారులు సమగ్ర సమాచారాన్ని మూడు రోజుల క్రితమే తీసుకున్నట్లు సమాచారం. మొత్తం 23 సూట్‌కేసు కంపెనీలలో జరిగిన లావాదేవీలపై ఈడీ ఈ దృష్టి సారించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై సైతం ఈడీ దృష్టి సారించింది. ఇటీవల హైదరాబాద్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నగదు వివరాలను ఈడీ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈడీ ఐదు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించే సమయంలో ఎప్పటికప్పుడు సిట్ అధికారులతో సంప్రదిస్తూ... వారికున్న సందేహాలను ఈడీ అధికారులు నివృత్తి చేసుకుంటున్నారని సమాచారం.

కస్టడీకి ఎంపీ మిథున్‌రెడ్డి

మరోవైపు ఈ కేసులో ఏ-4గా ఉన్న మిథున్ రెడ్డిని పోలీస్ కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం... మిథున్ రెడ్డిని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలన్న అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని... రెండు రోజులకు అనుమతిచ్చింది. ఈ మేరకు సెప్టెంబర్ 19, 20 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మిథున్ రెడ్డిని పోలీసు కస్టడీలో విచారించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది.

మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

దుష్ప్రభావాలు, అవగాహనపై కళారూపాల వర్క్‌షాప్

విశాలాంధ్ర - హైదరాబాద్: యువత జీవితాలకు ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, మఖ్దూమ్ భవన్, రాజ్ బహదూర్ గౌర్ హాల్లో తెలంగాణ ప్రజానాట్య మండలి నిర్వహించిన మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళారూపాల వర్క్‌షాప్ ను మంత్రి గురువారం ప్రారంభించారు. జూపల్లి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ... అవగాహన కల్పించడానికి రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద ప్రజానాట్య మండలి తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. తొలుత కళాకారులు ప్రదర్శించిన ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దురా... కార్పొరేట్ వద్దురా ప్రభుత్వ ఆసుపత్రులు ముద్దురా... అనే రెండు వీధి నాటకాలను మంత్రి జూపల్లి తిలకించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, సమితి సభ్యులు మరుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కె. లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

పిల్లలకు సురక్షిత నగరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్‌ను సచివాలయంలో ఆవిష్కరించారు. మంత్రులు మాట్లాడుతూ హైదరాబాద్‌ను "పిల్లలకి సురక్షిత నగరం"గా తీర్చి దిద్దడానికి యునిసెఫ్ కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యునిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేస్తాయన్నారు. మహిళా, శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, జీహెచ్‌ఎంసీ విభాగాల సమన్వయంతో బుల్లీయింగ్, ఈవ్-టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు.ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన శిక్షణ ఇవ్వనున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, యునిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీసర్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే పాల్గొన్నారు.

7,754 ప్రత్యేక బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. జీవో 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. "గతంలో కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. బస్ బయలుదేరు ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోంది" అని ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. ముందస్తు రిజర్వేషన్ సంస్థ అధికారిక వెబ్ సైట్ tgsrtcbus.inలో చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

భారీ వర్షంతో అప్రమత్తంగా ఉండాలి: పొన్నం

హైదరాబాద్‌లో భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పోలీస్ ,విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అత్యవసరమైతేనే ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు తక్షణం స్పందించాలని అన్నారు. మ్యాన్‌హోల్ వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆదేశించారు.

సింగిల్ లాగిన్‌తో ఈపీఎఫ్ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

బ్యాలెన్స్, లావాదేవీలు, విత్‌డ్రాలు వంటివి తెలుసుకోవాలంటే ప్రత్యేకంగా పాస్‌బుక్ పోర్టల్ ఓపెన్ చేయాల్సిందే. ఇకపై ఆ అవసరం లేకుండా ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌లోనే పాస్‌బుక్ లైట్ పేరిట కొత్త సేవలకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి వివరించారు. ఇందులో పీఎఫ్ కంట్రిబ్యూషన్, విత్‌డ్రా, బ్యాలెన్స్ వంటి వివరాలు తెలుసుకోవచ్చు. సమగ్ర వివరాలు, గ్రాఫిక్స్‌తో కూడిన సమాచారం కావాలంటే పాస్‌బుక్ పోర్టల్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల యూజర్ ఎక్స్‌పీరియన్స్ మెరుగవ్వడంతో పాటు సింగిల్ లాగిన్‌తోనే ముఖ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం పీఎఫ్ ట్రాన్స్‌ఫర్లు, సెటిల్‌మెంట్లు, అడ్వాన్సులు, రిఫండ్ వంటి సేవలకు ఆర్పీఎఫ్‌సీ/ ఆఫీసర్-ఇన్-ఛార్జి స్థాయి అధికారుల ఆమోదం తప్పనిసరి. ఈ విషయంలో కీలక మార్పు చేసింది. ఆ బాధ్యతలను అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్, సబార్డినేట్ స్థాయి ఉద్యోగులకు బదిలీ చేసింది. దీనివల్ల వేగంగా సెటిల్‌మెంట్లు పూర్తవుతాయని, ప్రాసెసింగ్ సమయం గణనీయంగా తగ్గుతుందని మంత్రి వివరించారు.

యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

వంటి సంస్థల ద్వారా తెలంగాణ ను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని వివరించారు. "ఏఐ ఇన్నోవేషన్ హబ్ "లో డిజైనింగ్ కు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిజైనింగ్ అంటేనే సృజనాత్మకత అని, కాకపోతే... అది యూజర్ ఫ్రెండ్లీ గా ఉండాలన్నారు. అప్పుడే ఆ యాప్ లేదా వెబ్ సైట్ మనుగడ సాధ్యమన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే అంకుర సంస్థలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.

అదానీకి సెబీ క్లీన్‌చిట్

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌సైడర్ ట్రేడింగ్, మార్కెట్ మ్యానిపులేషన్, పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలకు సంబంధించి గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు వెలువరించింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు ఆ గ్రూప్‌నకు చెందిన ఇతర కంపెనీలపైనా హిండెన్‌బర్గ్ సంస్థ 2023 జనవరిలో తీవ్ర ఆరోపణలు చేసింది. అదానీ పవర్ లిమిటెడ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ వంటి లిస్టెడ్ కంపెనీల్లో నిధుల మళ్లింపునకు అడికార్ప్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెహ్వార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలను అదానీ గ్రూప్ వినియోగించిందని ఆరోపించింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీలతో జరిగిన లావాదేవీల్లో ఎలాంటి నిబంధనల ఉల్లంఘనా జరగలేదని సెబీ బోర్డు సభ్యుడు కమలేష్ సీ వార్ష్నీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మదుపర్లను తప్పుదోవ పట్టించేలా ఎలాంటి నిబంధనల ఉల్లంఘనా జరగలేదని సెబీ స్పష్టంచేసింది. అదానీ గ్రూప్ సంస్థలు గానీ, ఎగ్జిక్యూటివ్‌లు గానీ ఎలాంటి తప్పూ చేయలేదని, జరిమానా విధించాల్సిన అవసరం లేదని తెలిపింది.

వారు దేశానికి క్షమాపణ చెప్పాలి: అదానీ

సెబీ క్లీన్‌చిట్ ఇచ్చిన వేళ గౌతమ్ అదానీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... హిండెన్‌బర్గ్ ఆరోపణలు అవాస్తవమని మరోసారి రుజువైందన్నారు. తాము ఎప్పటినుంచో ఇదే విషయం చెబుతున్నామన్నారు. ఈ కుట్రపూరిత నివేదిక కారణంగా పెట్టుబడిదారులు నష్టపోయినందుకు బాధగా ఉందన్నారు. తప్పుడు వాదనలు ప్రచారం చేసిన వారు దేశానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జాతి నిర్మాణంలో తమ నిబద్ధత కొనసాగుతుందందన్నారు.

ఓట్ల దొంగలకు ఈసీ అండ

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్లను ప్రవేశపెట్టారు. ఇందులో సూర్యకాంత్ 14 నిమిషాల్లో ఓటర్ల తొలగింపు కోసం 12 ఫారాను దాఖలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా సూర్యకాంత్ పేరును తొలగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓటరు బబితా చౌదరి కూడా అక్కడే ఉన్నారు. సూర్యకాంత్ కన్నడలో మాట్లాడుతూ ఓటర్ల తొలగింపులో తన ప్రమేయాన్ని ఖండించారు. అదేవిధంగా పేరు ఉపయోగించిన వృద్ధ మహిళ కూడా అలాంటి ఫారాలు దాఖలు చేయలేదని ఖండించారు. నాగరాజ్ పేరుతో తెరపై కనిపించిన మరో దరఖాస్తుదారుడు 36 సెకన్ల వ్యవధిలో రెండు దరఖాస్తులు దాఖలు చేశాడు. 'డిసెంబర్ 19, 2022న, ఈ వ్యక్తి ఉదయం 4.07 గంటలకు మేల్కొని ఓటర్ల పేర్లను తొలగించడానికి రెండు దరఖాస్తులు దాఖలు చేశాడు. దయచేసి ఫారాలు పూరించడానికి ప్రయత్నించండి, ఎంత సమయం పడుతుందో చూడండి' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లను తొలగిస్తూ కొత్తగా నకిలీ ఓట్లను ఎలా సృష్టిస్తున్నారో రాహుల్ గాంధీ వివరించారు. అలంద్‌కు భిన్నంగా మహారాష్ట్రలోని రజూరా ఉంది. ఇక్కడ 6,850 మంది ఓటర్ల పేర్లు చేర్చినట్లు చెప్పారు. 'అలంద్‌లో బలమైన కాంగ్రెస్ బూత్‌లలో ఓటర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించారు. ఇతర ప్రదేశాలలో ఓటర్లను చేర్చుతున్నారు. మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో ఇదే జరిగింది' అని రాహుల్ తెలిపారు. కర్నాటకలో ఓట్ల తొలగింపుపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన సీఐడీ... ఎక్కడినుంచి దరఖాస్తు చేశారో ఐపీ నంబర్లు ఇవ్వాలని ఈసీని కోరినా ఇవ్వలేదన్నారు. 18 నెలల్లో సీఐడీ 18 లేఖలు రాసినా స్పందన లేదన్నారు. కర్నాటక సీఐడీ అడిగిన వివరాలను వారంలోగా ఇవ్వాలని ఈసీని కోరుతున్నామన్నారు. ఓట్ల దొంగలను రక్షిస్తోంది సీఈసీ జ్ఞానేష్‌కుమారేనని రాహుల్ దుయ్యబట్టారు. కర్నాటకలో ఓట్లు తొలగించేందుకు వివిధ రాష్ట్రాల ఫోన్ నెంబర్లు వాడారన్న రాహుల్‌గాంధీ... ఈ నంబర్లు ఎవరివి? ఎవరు ఆపరేట్ చేశారో తేలాలన్నారు. సూర్యకాంత్ పేరుతో 12 నిమిషాల వ్యవధిలో 14 దరఖాస్తులు వెళ్లాయన్న రాహుల్... ఆయనకు తెలియకుండానే ఓటు తొలగించాలని దరఖాస్తు చేశారని అన్నారు. ఫేక్ లాగిన్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తోనే ఓట్లు తొలగిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. బీజేపీ, ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నేను ఈ మాటను తేలిగ్గా అనడం లేదు. లోక్‌సభ ప్రతిపక్ష నేతగా చెబుతున్నాను. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓట్ల దొంగలకు రక్షణ కల్పిస్తున్నారు. ఇది పచ్చి నిజం. ఇందులో ఎలాంటి గందరగోళం లేదు' అని ఆయన తీవ్రంగా ఆరోపించారు. గతంలో తాను చెప్పినట్లుగా త్వరలోనే 'హైడ్రోజన్ బాంబ్' లాంటి బలమైన సాక్ష్యాలు బయటపెడతానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈరోజు చూపించింది కేవలం దాని ట్రైలర్ మాత్రమేనని, అసలు విషయం ముందుందని ఆయన పేర్కొన్నారు. ఆ పని తాము చేసినప్పుడు లోక్‌సభ సీట్లు మోసం ద్వారా గెలిచారనడంలో సందేహాలకు తావుండదన్నారు. 'ఈ దేశ ప్రజలకు, యువతకు నిజం చెప్పడం నా విధి. నేను రాజ్యాంగాన్ని రక్షిస్తున్నాను. ఇది భారతదేశ సంస్థల బాధ్యత. కానీ వారు అలా చేయడం లేదు' అని రాహుల్ తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా ఓట్ల తొలగింపు అసాధ్యం: ఈసీ

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు అవాస్తవం, నిరాధారమని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఓ ప్రకటన విడుదల చేసింది. రాహుల్‌గాంధీ పొరపాటుగా భావించినట్లు ఏ ఒక్కరూ కూడా ఆన్‌లైన్ ద్వారా మరొకరి ఓటును తొలగించలేరని స్పష్టం చేసింది. తన వాదన వినిపించేందుకు ఓటు కోల్పోయిన బాధితుడికి అవకాశం ఇవ్వకుండా ఓటు తొలగించటం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఓట్ల చోరీ ద్వారా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నవారిని సీఈసీ జ్ఞానేష్‌కుమార్ కాపాడుతున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించిన నేపథ్యంలో ఈసీ ఈ మేరకు వివరణ ఇచ్చింది. "సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించడం లేదు. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల తొలగింపునకు ఇలాంటి విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ విజయం సాధించారు" అని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

జాతీయ వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్, ప్రవాసీ భారతీయ కేంద్రం మాల్చాలో నిర్వహించిన అస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్, బ్లాక్స్ ప్రోగ్రాం (ఏపీ డి - ఏపీ బి 2.0) భవిష్యత్ దిశ వర్క్‌షాప్ మీటింగ్ లొ గురువారం పాల్గొన్నారు. ఎన్ ఐ టి ఐ అయోగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల ప్లానింగ్ సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆకాంక్షిత జిల్లా, మండల ప్రోగ్రామ్‌లలో భాగంగా ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, ప్రాథమిక సదుపాయాలు వంటి రంగాల్లో సాధించిన పురోగతిని ఇక్కడి సదస్సులో సమీక్షించారు. ఈ పురోగతిని సాధించటానికి ఎదుర్కొన్న సవాళ్లపై చర్చించారు. భవిష్యత్ దశల్లో కీలకమైన అభివృద్ధి సూచికలను సంపూర్ణంగా సాధించటానికి అవసరమైన చర్యలను సమగ్రంగా పరిశీలించారు. అదేవిధంగా ఏప్రిల్ 2026 నుండి అమలులోకి రానున్న ఏపీ డి ఏపీ డి 2.0 కార్యక్రమాల రూపకల్పనపై సుదీర్ఘ చర్చలు నిర్వహించినట్లు కొత్తగూడెం జిల్లా కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆ సదస్సులొ జిల్లాలో ఆకాంక్షిత జిల్లా, మండల ప్రోగ్రామ్‌లలో జరుగుతున్న అభివృద్ధి, అనుభవాలను పంచుకున్నారు. అలాగే తదుపరి దశల్లో జిల్లాకు అవసరమైన ప్రాధాన్యతా అంశాలను వివరించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గూడూరు : స్త్రీలకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ నవత అన్నారు. గురువారం జిల్లాలోని గూడూరు మండలం అయోధ్య పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అప్పరాజపల్లి ఆయుష్మన్ ఆరోగ్య మందిర్‌లో అయోధ్య పురం వైద్యాధికారి డాక్టర్ బి యమునా ఆధ్వర్యంలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ అనే ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ నవత గైనకలజిస్ట్‌తో స్త్రీలకు వచ్చే వ్యాధులకు, వాళ్లు ఎదుర్కొనే వ్యక్తిగత రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ నవత డాక్టర్ యమునలు మాట్లాడుతూ ప్రతి ఒక్క స్త్రీలు వ్యకిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని, ఇంట్లో స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లు కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. యు వైద్య శిబిరంలో జిల్లా ఎంసీ హెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ఎంసిహెచ్ డాక్టర్ ఎండి సిరాజ్, పిడిఎంఓ డాక్టర్ ప్రతిభ, హెచ్‌ఈఓ లోక్య, గణేష్, సర్దార్ బాబు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆహారంలో నూనెలు, చెక్కరలు సరైన మోతాదులో తీసుకోవాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : మనం తీకునే ఆహారం లో నూనెలు, చెక్కరలు అలాగే ఉప్పు సరిపోను మోతాదులో ఉపయోగించటం ద్వారా ఆరోగ్యం ని కాపాడుకోవచ్చని జిల్లా సంక్షే మ అధికారి దయానందరాణి పిల్లలు, కిషోర్ బాలికలు, గర్భిణీలు అలాగే బాలింతలకు సూచించారు. పోషణ మాసం 2025 కార్యక్రమంలో భాగంగా పోషకహార లోపం, ఒబేసిటీ గురించి సూర్యాపేట పట్టణం అంబేద్కర్ నగర్ 1 అంగన్వాడిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజువారి ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు ముఖ్యంగా మునగ ఆకు మనం తీసుకోవడం వలన రక్తహీనత బారిన పడకుండా ఉంటామని, కిషోర్ బాలికలకు తినుభండారాలైన చాక్లెట్స్, బిస్కెట్ ఇతర నూనెలో అధికంగా వేయించిన వాటికి బదులుగా ప్రతిరోజు పల్లిపట్టి, నువ్వుల లడ్డు ఇవ్వాలని చెప్పారు. సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆవు కడుపు నుండి 90 కిలోల ప్లాస్టిక్ తొలగింపు

విశాలాంధ్ర - కోదాడ : కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం ఆవుకి అరుదైన ఆపరేషన్ చేసి 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పట్టణంలో ఒక రైతుకు చెందిన 9 సంవత్సరాల ఆవు కొద్ది రోజులుగా పొట్ట ఉబ్బి మేత మేయకుండా ఎక్కడ పడితే అక్కడే నిలబడి నీరసంగా ఉండడంతో సదరు రైతు వైద్యం కొరకు ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకునిరాగా అసిస్టెంట్ డైరెక్టర్ డా పి.పెంటయ్య ఆవుని పరీక్షించి కడుపులో భారీ మొత్తంలో ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయని, ఆవు కుడా ఐదు మాసాల గర్భంతో ఉండడంతో అత్యవసరంగా ఆపరేషన్ చేసి ప్లాస్టిక్ కవర్లు, వైర్లు, కేబుల్ వైర్లు, తాళ్ళు, తీగలను తొలగించారు. ఈ ఆపరేషన్‌లో డా. సురేంద్ర, డా.బి.శ్రీనివాస్, సిబ్బంది, చంద్రకళ, సాగర్, అఖిల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా అవసరమైనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొను గోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పత్తి మార్కెటింగ్ సీజన్ 2025-26లో జిల్లా సగటు దిగుబడి అంచనాకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా ఉత్పత్తి వివరాలు సేకరించి వాస్తవికంగా సగటు దిగుబడిని లెక్కించనుందని తెలిపారు. రాష్ట్ర సగటు కంటే 10శాతం మించితే ప్రత్యేక ధ్రువీకరణతో మాత్రమే ఆమోదం ఉంటుందని స్పష్టం చేశారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సిపిఓ జీవరత్నం, ఎడి మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డిఎస్ఓ రాజేందర్, డిఎం సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లాలోని సీరోలు మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని బాలుర, బాలికల వసతి గృహాల్లోని కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, బియ్యం, త్రాగు నీరు, తదితర వాటిని తనిఖీ చేసారు. వంట గదిని పరిశీలించి, వంట మనుషులు అనుభవం, భోజన మెనూ వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేసి విద్యార్థుల్లో పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకోసం ఉపాధ్యాయులు విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై పట్టు సాదించేలా కంప్యూటర్ విద్యనూ బోదించాలని అన్నారు. పాఠ్యాంశాలలోని వివిధ అంశాలపై కలెక్టర్ అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానం చెప్పడంతో విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని అందుకోసం పాఠశాల ప్రాంగణంలో అనువైన స్థలాలను గుర్తించి చదును చేసి వాడుకలోకి తీసుకురావాలన్నారు.

సీరోల్ ప్రత్యేక అధికారి, తహసిల్దార్ పున్నంచందర్, ప్రిన్సిపాల్ సంతోష్ సోని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారి, ఆర్.ఐలు సుమతి, శ్రావణి, గ్రామ పాలన అధికారి వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ సదరం కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : పెండింగ్‌లో ఉన్న సదరం కేసులను వచ్చే నెలలోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరాన్ని సందర్శించారు. సదరం క్యాంపులను ఆసుపత్రిలోని పాత భవనంలో నిర్వహిస్తుండగా, నూతన భవనంలోకి మార్చాలని ఇదివరకే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అయితే కొత్త భవనానికి సంబంధించిన పార్టీషన్, ఎలివేషన్ పనులవల్ల శిబిరం మార్పు సాధ్యమా కాలేదని డిఆర్‌డిఓ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పాత భవనంలోని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొత్త భవనంలో సదరం క్యాంపుల నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక పెండింగ్‌లో ఉన్న 2564 సదరం దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల నాటికి క్యాంపుల నిర్వహన, పరిష్కారం పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిజిహెచ్ డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ నగేష్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణ ఆమోదంపై హర్షం

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: ఈనెల 21న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పెద్దపల్లి ఎస్ఎస్ పంక్షన్ హాల్లో వర్గీకరణ కోసం సాగిన ఉద్యమ ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ బి సి డి, సీనియర్ ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు గొర్రె రాజయ్య, తోకల మల్లేష్, దాసరి ఎల్లయ్య, మాతంగి గీత తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన ఉద్యమ ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎబిసిడి వర్గీకరణకు ఆమోదం తెలపడం, అమలుకు చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి దేవని సతీష్ మాదిగ, అల్లారం రత్నం హాజరవుతున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో వివిధ రంగాల్లోని మాదిగ జాతి మేధావులు, సంఘాల నాయకులు, మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇసుక లారీల దుమ్ముతో ప్రజల అవస్థలు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : వెంకటాపురం మండలంలోని, వివిధ, తదితర ప్రాంతాలనుండి వస్తున్న ఇసుక లారీల దుమ్ముతో, ప్రజలు అవస్థలుపడుతున్నారు. రోడ్ల ద్వారా ప్రయాణించే బాటసారులకు, టువిలర్ ద్విచక్ర వాహనం ద్వారాప్రయాణం చేసే వారికి, పగలు కూడ, కనీసం, రోడ్లు, కనిపించడంలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. కనీసం రోడ్లపై, దుమ్ము లేవకుండా వాటర్ క్లూరింగ్ చేయడం లేదని, లక్షల రూపాయలు, ఇసుక క్వారీల ద్వారా, ప్రభుత్వంకు, డబ్బులు వస్తుందని, ప్రజల ప్రాణాలను, గాలికి వదిలేసారిని, రోడ్ల పై దుమ్ము లేవడంపై, ఎదురుగా వచ్చే వాహనంలు కనిపించడం లేదని, దమ్ము వల్ల ప్రమాదలు జరిగే అవకాశం ఉందని, వెంటనే జిల్లా కలెక్టర్, టిఎస్ ఎం డిసి అధికారులు, పోలీస్‌శాఖ, రెవిన్యూ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, టూ విలర్ వాహనందారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇట్టి విషయంపై టిఈస్ ఎండి సి ప్రాజెక్టు అధికారి కార్యాలయంకు, వెళ్లగా అందుబాటులో లేరు, ఫోన్ ద్వారా వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నం చేయగా, ఫోన్‌లో కూడ అందుబాటులో లేరు.

త్వరలో ఈపీ ఆపరేటర్లకు పదోన్నతులు

విశాలాంధ్ర - హైదరాబాద్, పెద్దపల్లి, సింగరేణి: ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న అర్హత గల ఈపీ ఆపరేటర్లకు ఎక్స్ కవేషన్ కేటగిరీ-డి నుండి ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి కి, ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి నుండి ఎక్స్ కవేషన్ కేటగిరీ-బి కి త్వరలో పదోన్నతులు లభించనున్నాయి. వీటివలన సింగరేణి వ్యాప్తంగా సుమారు 150 మంది ఆపరేటర్లు ఈ ప్రమోషన్లు పొందనున్నారు.ఎక్స్ కవేషన్ కేటగిరీ-డిలో రెండు సంవత్సరాలు పూర్తి చేసిన ఆపరేటర్లకు ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి ప్రమోషన్ ఇవ్వడానికి అలాగే ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి లో మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఆపరేటర్లకు ఎక్స్ కవేషన్ కేటగిరీ-బికి పదోన్నతులను ఇవ్వటానికి యాజమాన్యం అంగీకరించింది. ఖాళీలతో సంబంధం లేకుండా ఈ ప్రమోషన్లు ఈ ఒక్కసారి మాత్రమే కల్పించాలని నిర్ణయిం చారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇటీవల జరిగిన 38వ సీఎండీ స్థాయి మరియు 50వ డైరెక్టర్ (పా) స్థాయి నిర్మాణాత్మక సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం ఇచ్చిన ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఈపీ ఆపరేటర్లు ఎక్స్ కవేషన్ కేటగిరీ-డి లో 2 సంవత్సరాలు పనిచేసిన తర్వాత ప్రాక్టికల్ పరీక్ష మరియు అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధించినట్లయితే వారికి ఎక్స్ కవేషన్ కేటగిరీ-డి నుండి ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి కి ఖాళీలను బట్టి ప్రమోషన్ లను కల్పిస్తుండేవారు. అలాగే ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి లో 3 సంవత్సరాలు పనిచేసి ప్రాక్టికల్ పరీక్ష అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధించినట్లయితే వారికి ఎక్స్ కవేషన్ కేటగిరీ-సి నుండి ఎక్స్ కవేషన్ కేటగిరీ-బి కు ఖాళీలు ఏర్పడినప్పుడు పదోన్నతులను కల్పించేవారు. ఈ అంశంపై యాజమాన్యం స్పందించి ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారు ఈ అంశంపై చర్చించి ఒక నివేదికను సమర్పించారు. ఈ నివేదిక పరిశీలించిన అనంతరం సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ ఈ ఒక్క సారికి ఖాళీలతో సంబంధం లేకుండా కంపెనీ నియమ నిబంధనలను అనుసరించి ప్రమోషన్లు ఇవ్వటానికి అంగీకరించడం జరిగింది.

యూరియా దొరకక సతమతమవుతున్న రైతులు

విశాలాంధ్ర - తుంగతుర్తి : వ్యవసా య పనులు చేసుకోలేక యూరియా దొరకక సతమతమవు తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగతుర్తి సహకార సంఘం కార్యాలయం నందు యూరియా బస్తాలు దొరకక 15 రోజుల నుండి రైతులు రాత్రి పగలు తేడా లేకుండా షాపుల ముందే పడికాపులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. యూరియా కొరకు వచ్చిన రైతులకు కనీసం మంచినీరు సౌకర్యం కూడా కల్పించలేకపోయినా రైతు సహకార సంఘం డైరెక్టర్లు అధ్యక్షులు అధికారులు ఎండలో నిలబడి అలసిపోయిన రైతులకు ఆహారం అందించకపోయినా కనీసం మంచినీరు కూడా అందించకపోవడం రైతులను అవమానించడమే ప్రజలందరికీ అన్నం పెడుతున్న రైతును కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా బస్తాల కొరకు ఇబ్బందులు పెట్టడం చాలా బాధాకరమన్నారు. అటు వ్యవసాయ పనులు పోగొట్టుకొని వేరే కూలికి పోకుండా ప్రతిరోజు యూరియా బస్తాల కొరకు వేచి చూడడంతో పాటు ప్రతిరోజు వచ్చి పోవడం భారంగా ఉందన్నారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వెంటనే వ్యవసాయ అధికారులతోటి మాట్లాడి నియోజకవర్గానికి కావలసిన యూరియాను తెప్పించి రైతులను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను తెప్పించి రైతులకు అందజేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన జిల్లా రవాణా అధికారి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైనటువంటి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా, ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి ఇద్దరు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శిక్షణ కొరకు రావడం జరిగిందని, ములుగు జిల్లా రవాణా శాఖ అధికారి బారగాడి శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వాహనా దారులకు సరి అయిన పేపర్స్ లెందున కేసులు పెట్టడం జరిగిందన్నారు. గురువారం వాహనాలు తనిఖీలు చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా పలు వాహనాలకు రోడ్ టాక్స్ సరియైన పేపర్లు లేనందున కేసులు రాయడం జరిగిందన్నారు. ములుగు జిల్లా రవాణాశాఖ అధికారి బారాగాడి శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఫర్వాన్ అనీఫ్ సవారి గౌతమ్ కానిస్టేబుల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవచూపి ఎత్తివేయాలని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి అన్నారు. నాడు ఆర్టీసీ ఉద్యమంలో 50 రోజుల పాటు సుదీర్ఘంగా ఆర్టీసీ కార్మికులకు అండగా ఉండి ఉద్యమం చేసిన సందర్భంలో నాడు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా వామపక్ష ఉద్యమకారులపై కేసులు పెట్టించాడన్నాడని, ఆ కేసులలో భాగంగా గురువారం కోర్టు హాజరైనట్లు ఆయన తెలిపారు. కోర్టుకు హాజరైన వారిలో పెరుగు కుమార్, దేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి తెలుగు శ్రావణ్, మంద శంకర్, పద్మ, షంషీర్, లాలు, కూరాకుల పాల్, లక్ష్మీనరసు రామ నర్సు, పవన్, మధుకర్, తండ మాధవి, తండ వినోద, గడ్డం స్వరూప, బేతమల్ల శారద, రమేష్, కాజా మియా, బిక్ష నాయక్, కోన సత్యం బాబు, వెంకన్న, శ్రీను కోర్టుకు హాజరైనారు.

పోషకాహారంతో పాటు నిర్దిష్టమైన విద్యను అందించాలి

విశాలాంధ్ర - తొర్రూరు: అంగన్వాడి కేంద్రాలలో బలవర్ధకమైన పోషణ ఆహారం తో పాటు నిర్దిష్టమైన విద్యను అందించి, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కె.కమలాదేవి అన్నారు. తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర, నెల్లికుదురు మండలాల అంగన్వాడి టీచర్లకు పోషణ్ బి- పడాయి బీ, పోషణ మాసం పేరిట డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్ లో మూడురోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా సిడిపిఓ కె.కమలాదేవి మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని,చిన్నారులు గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ అంగన్వాడి కేంద్రాలలో మంచి పోషణ సమగ్ర విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు జరిగే ఈ పోషణమాసంలో అంగన్వాడీ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య- పోషకాహారంపై చర్చలు, ప్రదర్శనలు, ప్రమాణ స్వీకారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏసీడీపీఓలు విజయలక్ష్మి, బి.సంకీర్తన, సూపర్వైజర్లు మల్లేశ్వరి, శ్రీదేవి, శోభ, గౌసియా, సునీత, నాగమణి, సమన్వయకర్త నడిగడ్డ అశోక్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యావసతుల విస్తరణకు నిరంతర కృషి : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : విద్యా వసతుల విస్తరణకు నిరంతరం కృషి చేస్తున్నానని పేద విద్యార్థులు అసౌకర్యాలతో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తేనే సరైన ఫలితాలు వుంటాయని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని రామవరం ఏరియా బాలికల గురుకుల పాఠశాలలో రూ.5 కోట్ల ఐటీడీఏ నిధులతో చేపట్టనున్న వసతి గృహాల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ శాతం గిరిజన, గిరిజనేతర పేద విద్యార్థులు, గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం మంది వసతిగృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వీరిని మరింత ప్రోత్సహించి ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకోసం ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి తక్షణమే వాటి పరిష్కారానికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆశ్రమ పాఠశాలలో, వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేదా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కూనంనేని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, ఆర్సీవో అరుణకుమారి, ప్రిన్సిపల్ శిరీష, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జాములయ్య, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మర్రి గోపి కృష్ణ, తూముల శ్రీను, అంకుస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగబాటు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లోనికి పోయారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియా కు ఒక ప్రకటన విడుదల చేస్తూ వివరాలు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులలో ఒకరు ఏసియం సభ్యుడు, ఒకరు పార్టీ సభ్యుడు తోపాటు నలుగురు మలేషియా సభ్యులు ఉన్నట్టు తెలిపారు. జిల్లా పోలీసులతోపాటు 81, 141 సిఆర్పిఎఫ్ బెటాలియన్ అధికారులు చేపట్టిన ఆపరేషన్ చేయుత కార్యక్రమంలో భాగంగా మావోయిస్టులు లొంగిపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తోపాటు పోలీసులు గిరిజనుల అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేస్తున్నట్టు తెలిపారు. దీంతో సానుకూల ఫలితాలు లభిస్తున్నాయని ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈరోజు లొంగిపోయిన వారికి ఒక్కొక్కరికి 25 వేలు తక్షణ సహాయం కింద మొత్తం లక్షన్నర అందించినట్లు చెప్పారు. మడకం దేవ మడవి జోగా, పొడియం దేవా, మడకం ఇడుమ, మడవి ఐత, మడకం ముకా లు ఎస్పీ ముందు లొంగిపోయిన వారిలో వున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు 320 మంది వరకు మావోయిస్టు లోనికి పోయినట్లు ఎస్పీ వెల్లడించారు. మావోయిస్టులు అజ్ఞాతవాసం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన అభ్యర్థించారు.

ఐటీడీఏ పీవోను కలిసిన దిసోమ్ సంస్థ బృందం

విశాలాంధ్ర - భద్రాచలం : షెడ్యూల్ ఏరియాలో పరిధిలో జరుగుతున్న గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై జార్ఖండ్ రాష్ట్రం దిసోమ్ సంస్థ బృందం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ లో కలిసి వివరాలు సేకరించారు. గురువారం వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది యువ విద్యార్థులు గిరిజనుల సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి పరిశీలనకు వచ్చారు. పీవో రాహుల్‌ను తన ఛాంబర్‌లో కలిసి షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వారు పరిశీలన చేసిన ప్రదేశాల గురించి క్లుప్తంగా వివరించారు. ఇక్కడ గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న గిరిజన సంక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.ఓ మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల సంక్షేమానికి, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని పథకాలను ఆ బృందానికి వివరించారు. నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు అందించి వారిని ఆర్థికంగా తీర్చిదిద్దు తున్నట్లు చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యను పునాది నుండి బలోపేతం చేయడానికి ఉద్దీపకం వర్క్ బుక్స్, కెరీర్ గైడెన్స్ ఇతర కార్యక్రమాల ద్వారా ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. గిరిజనుల జీవనోపాధికి తీసుకుంటున్న అంశాలను పిఓ వివరించారు. పీవో ను కలిసిన ఈ బృందంలో కేరళ నుంచి గిరిజ మావిలన్, అస్సాం నుంచి మిజింగ్ నర్జరి, మహారాష్ట్ర నుంచి మునిర్, ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీను సోడే, లెనిన్ సోడే, ఇండిజినెస్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్‌కు చెందిన పాయం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఇల్లందు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఇల్లందు డిఎస్పి చంద్రభాను హెచ్చరించారు. ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని వినోభా నగర్లో సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డి.ఎస్.పి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా సుమారు 250 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. సరిగా పత్రాలు లేకుండా, నెంబర్ ప్లేట్లు లేని 70 ద్విచక్ర వాహనాలను, 3 ఆటోలను, ఒక కారును సీజ్ చేయడం జరిగిందన్నారు. అనంతరం వినోభా నగర్ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్పి పలు సూచనలు చేశారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడవద్దని హెచ్చరించారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తె పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర దళిత జర్నలిస్టుల ఫోరం మహాసభలు నేడు

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : దళిత జర్నలిస్టుల హక్కులు, సమస్యలు, సామాజిక బాధ్యతలపై చర్చించుకునే వేదికగా రాష్ట్ర దళిత జర్నలిస్టుల ఫోరం 10వ మహాసభలు శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరగనున్నాయని దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈర్ల సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జరుగు ఈ మహాసభలు, జర్నలిజం వృత్తిలో ఉన్న దళితులకు మార్గదర్శకత్వం ఇవ్వడమే కాక, సామాజిక న్యాయ పోరాటాలకు ఆవిష్కరణల వేదికగా నిలుస్తున్నాయని, ఈ మహాసభలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, మీడియా రంగంలో సమానావకాశాల అవసరం, తదితర అంశాలపై చర్చించనున్నారని, ప్రతి సభ్యుడు హాజరై సంఘీభావాన్ని చాటితేనే ఈ సభలకు అసలైన అర్థం వస్తుందని, ఈ చారిత్రక క్షణానికి సాక్ష్యులవ్వాలని ఆయన కోరారు. శుక్రవారం ఉదయం 11 గంటల లోపు సభ ప్రాంగణానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

సంపాదకీయం

ఆ విధానమే సరిలేదు!

భారతదేశంలో ప్రభుత్వ వ్యవసాయ విధానం అస్తవ్యస్తంగా ఉందని చెప్పడానికి యూరియా కొరత ఒక ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఎన్నో రాష్ట్రాల్లో ప్రస్తుతం యూరియా కొరత వేధిస్తోంది. ముఖ్యంగా ఏపీలో రైతుల ఆందోళనలు మిన్నంటాయి. అవసరానికి సరిపడా యూరియా దొరక్కపోగా, బ్లాక్‌మార్కెట్ పెద్ద తలనొప్పి వ్యవహారంగా మారిపోయింది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని ఒక డిపోలో 1500 మంది రైతులు యూరియా కోసం క్యూలో నిల్చొనగా, కేవలం 350 మందికి మాత్రమే యూరియా కట్టలిచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. కొరత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది. యూరియా అవసరాలు వ్యవసాయ సీజన్ (ఖరీఫ్/రబీ), సాగు విస్తీర్ణం, వర్షపాతం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయనేది త్రోసిపుచ్చలేం. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలకు యూరియా చాలా అవసరం. రాష్ట్రంలో సుమారు 40% యూరియా కొరత ఉందని వ్యవసాయ అధికారులే చెపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా యూరియాను కేటాయిస్తున్నట్లు ఈ మధ్యనే ప్రకటించింది. 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించారు. ఇది విశాఖపట్నం పోర్టుకు చేరినట్లు ధృవీకరించారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, రాష్ట్రంలో సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. అదనంగా, వివిధ పోర్టులు, తయారీ కంపెనీల నుంచి మరో 29,236 మెట్రిక్ టన్నులు రవాణాలో ఉన్నాయి. మొత్తం మీద, సెప్టెంబర్ చివరి నాటికి 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరవచ్చని అంచనా. జిల్లా స్థాయి అవసరాలు మారుతూ వస్తున్నాయి. ఉదాహరణకు, గుంటూరు జిల్లాకు అవసరమైన 24,000 మెట్రిక్ టన్నులకు బదులుగా 26,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. భారీ వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో యూరియా కొట్టుకుపోయిందన్న వాదనలో పసలేదు. ప్రభుత్వం ఎరువుల సరఫరాను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ, అధికారుల వాస్తవ పనితీరు ఆ స్థాయిలో కనపడటం లేదు. ఇవన్నీ ఒకెత్తయితే, యూరియా అధిక వినియోగాన్ని తగ్గించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యూరియా వినియోగాన్ని తగ్గించిన రైతులకు రూ.800 ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఈ ప్రోత్సాహకాల గొడవ వచ్చే సీజన్‌కు సంబంధించినది. సీఎం ప్రకటన ఇప్పటికిప్పుడు రైతన్న ఎదుర్కొంటున్న కొరతను తీర్చలేదు.

యూరియా వాడకం వల్ల నష్టాలున్నాయని తెలియనిదికాదు. ప్రత్యామ్నాయం చూపడంలో ప్రభుత్వ వైఫల్యం కాదనలేని సత్యం. యూరియా అధికంగా వాడటం వల్ల నేలలోని నత్రజని శాతం పెరుగుతుంది. ఇది నేలలోని సారం విలువను మార్చి, నేలను కలుషితం చేస్తుంది. నేలలోని అదనపు యూరియా వర్షపు నీటితో కలిసి నదులు, చెరువులు, భూగర్భ జలాల్లోకి చేరుతుంది. దీనివల్ల నీటిలో విషపూరిత లవణాలు విపరీతంగా పెరిగి, చేపలు, ఇతర జలచరాలు చనిపోతాయి. యూరియాలోని నైట్రోజన్ వాతావరణంలోకి అమ్మోనియా వాయువుగా విడుదలవుతుంది. ఇది గాలి కాలుష్యానికి కారణమవుతుంది. పంట మొక్కలు ఆకులు, కాండం ఎక్కువగా పెరిగి, పూత, కాత సరిగా రాక... పంట దిగుబడితో పాటు, నాణ్యత కూడా తగ్గుతుంది. యూరియాలోని రసాయనాలు నేలను సహజసిద్ధంగా సారవంతం చేసే సూక్ష్మజీవులను, వానపాములను నాశనం చేస్తాయి. యూరియా అధికంగా వాడిన పంటలను తినడం వల్ల మనుషుల్లో నైట్రేట్ శాతం పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ఈ నష్టాలను తగ్గించడానికి, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువులు, సమగ్ర పోషక యాజమాన్యం పద్ధతులను పాటించడం మంచిది. అంతవరకు బాగానే ఉంది. కాకపోతే ఈ సూచనలన్నీ ప్రస్తుత ఖరీఫ్, రబీ సీజన్‌లకు సాధ్యమయ్యే పనేనా?

దేశంలో యూరియా కొరతకు ప్రధాన కారణం...ఈ రసాయనాన్ని ఇతర అవసరాలకు విచ్చలవిడిగా వాడుతుండటమే. పారిశ్రామిక ఉపయోగార్థం యూరియాను ప్లాస్టిక్, అడ్హెసివ్స్ (జిగురు), ఫార్మాల్డిహైడ్ రెసిన్‌ల తయారీలో ఉపయోగిస్తారు. ఇవి ఫర్నిచర్, ప్యానెల్స్, ఇతర నిర్మాణ సామగ్రిలో వాడతారు. డీజిల్ వాహనాల నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించడానికి యూరియాను డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌గా ఉపయోగిస్తారు. ఇది నైట్రోజన్ ఆక్సైడ్లను ప్రమాదకరం కాని నత్రజని, నీరుగా మారుస్తుంది. పేపర్ పరిశ్రమలో కొన్ని రకాల పేపర్లను తయారు చేయడానికి యూరియాను వాడతారు. వైద్య, సౌందర్య సాధనాల ఉపయోగార్థం యూరియాను కొన్ని రకాల చర్మ సంరక్షణ క్రీములు, లోషన్లు, మాయిశ్చరైజర్లలో ఉపయోగిస్తారు. ఇది చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. కొన్ని రకాల మందుల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తారు. విమానాశ్రయాలలో రన్‌వేల మీద పేరుకుపోయిన మంచును తొలగించడానికి డి-ఐసింగ్ ఏజెంట్‌గా యూరియాను వాడుతారు. అలాగే, పశువులకు ఇచ్చే దాణాలో ప్రోటీన్ శాతాన్ని పెంచడానికి తక్కువ మొత్తంలో యూరియాను కలుపుతారు. ఇన్ని రకాల అవసరాల నేపథ్యంలో యూరియా కొరత సహజమేనని అనలేం. ఇవన్నీ తెలిసిన ప్రభుత్వం ఏం చేస్తోంది? నత్రజని అవసరం లేకుండా పంటలను పండించడం సాధ్యమా? జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్, అజస్పైరిల్లమ్, నీటి ఆకుపచ్చ నాచు వంటి వాటిని వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు. వీటి వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలూ ఉంటాయి. వాటి సరఫరాకు, లేదా స్థానికంగానే వాటి తయారీకి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నది? ఎరువుల సబ్సిడీని తగ్గించేందుకు 2013 జూన్‌లో మోదీ సర్కారు 'పీఎం-ప్రణామ్' పేరుతో ఒక పథకాన్ని తీసుకువచ్చింది. ఎరువుల సబ్సిడీని రూ.20 వేల కోట్లు తగ్గించుకోవాలన్నది కేంద్ర లక్ష్యం. మూడేళ్లపాటు అమలులో ఉండే ఈ పథకం కింద గ్రాంట్ పొందాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ఈ గ్రాంట్‌లో కొంత మొత్తాన్నయినా రైతుల ఖాతాల్లోకి జమచేస్తే ప్రస్తుత ఆందోళన తగ్గుతుందని ప్రభుత్వం భావించవచ్చు. కానీ దానిక్కూడా విధివిధానాలేవీ లేవు. ఈ-క్రాప్ అనేది ఒక ఫార్సుగా మారింది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఈ-క్రాప్ అనుసంధానమవుతుందని చెపుతున్నా, పంటలు వేసిన తర్వాత అవి నమోదవుతున్నాయి. అలాంటప్పుడు ఈ-క్రాప్‌కు ప్రాతిపదిక ఏముంటుంది? పైగా లక్షల మంది కౌలురైతులు రాష్ట్రంలో ఉన్నారు. చంద్రబాబు చెపుతున్న నగదు ప్రోత్సాహకం వారికి అందుతుందా? యూరియాను తగ్గిస్తే రూ.800 ఇస్తామన్నప్పుడు, డీఏపీ, ఎంఒపీ, ఎస్ఎస్‌పీ, ఎన్‌పీకే (కాంప్లెక్స్) వంటి ఇతర ఎరువుల వాడకం తగ్గింపుపై ప్రోత్సాహకాలుండవా? ఇదంతా చూస్తే, యూరియా కొరతను తీర్చకుండా సర్కారు వేసే కప్పదాటు వ్యవహారంలా గోచరిస్తోంది. ఏదేమైనప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విధానాలే అసమంజసంగా ఉన్నాయనేది విస్పష్టం. వాడకాలు, ప్రోత్సాహకాల సంగతి పక్కనబెట్టి, ఈ ఏడాది ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

ఉత్పత్తి పెరుగుతున్నా... సంక్షోభంలోనే రైతన్న

ఆర్ సూర్యమూర్తి

భారతదేశ వ్యవసాయ లక్ష్యాలు అద్భుతంగా ఉన్నాయి. పంటలు రికార్డు స్థాయిలో పండుతున్నాయి. కానీ పాలకుల వినాశకర విధానాలు రైతన్నలకు శాపంగా మారి వారి జేబులు ఖాళీగా ఉంటున్నాయి. ఉత్పత్తిలో పెరుగుదల కొనసాగుతున్నా పేద రైతులు ఇప్పటికీ ఆర్థిక సంక్షోభాన్ని చవిచూస్తేనే ఉన్నారు. భారతదేశంలో వ్యవసాయరంగం అతిపెద్ద రంగంగా ఉంది. ఏటా, మంత్రులు కెమెరాల ముందు నిలబడి రికార్డు ఉత్పత్తి లక్ష్యాలను ప్రకటిస్తున్నారు, దేశ రైతులు స్వయం సమృద్ధి, శ్రేయస్సు వైపు అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. తాజాగా జరిగిన జాతీయ వ్యవసాయ సదస్సు రబీ అభియాన్ 2025లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 2025-26 సంవత్సరానికి 362.5 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారు. ఇది పైకి చూడడానికి ఆకట్టుకునేలా కనిపిస్తోంది. లోతుగా పరిశీలిస్తేగానీ అసలు భండారం బయటపడదు. గత సంవత్సరం, భారతదేశం 353.96 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసింది - ఇది రికార్డు, ఆ ఏడాది అధికారిక ఉత్పత్తి లక్ష్యం 341.55 మిలియన్ టన్నుల కంటే ఎక్కువగానే ఉత్పత్తి జరిగింది.

పాలకుల ఆకర్షణీయ నినాదాలు, సమావేశ మందిరాల్లో వారి ప్రసంగాలకు చప్పట్లను తరిచిచూస్తే చీకటిచిత్రం బయటపడుతుంది. భారతదేశ వ్యవసాయం లోపాయికారి సేకరణ, పెరిగిన సబ్సిడీలు, అస్థిర ప్రపంచ మార్కెట్లు, వాతావరణ మార్పు చక్రంలో చిక్కుకుపోయింది. ప్రభుత్వం ప్రధాన లక్ష్యాలను నిర్ణయించడం వల్ల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ రాజకీయ దృక్పథాలు, రైతు వాస్తవాల మధ్య వైరుధ్యాల కింద కుంగిపోతున్నదనే వాస్తవం మరుగునపడిపోతోంది. నిజమే, భారతదేశంలో బియ్యం, గోధుమలు విస్తారంగా పండుతున్నాయి. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాములు నిండిపోతున్నాయి. 2023-24 సంవత్సరంలో ఈ రెండు పంటలపైనే సేకరణ ఖర్చు రూ. 2.1 ట్రిలియన్లు దాటింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందిస్తూనే ఉన్నారు.

ఒకపక్క కేంద్రం తనను తాను అభినందించుకుంటుండగా, దేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60శాతం దిగుమతి చేసుకుంటోంది ప్రపంచంలోనే అతిపెద్ద పప్పు ధాన్యాల కొనుగోలుదారుగా కొనసాగుతోంది. రికార్డు స్థాయిలో ధాన్యం ఉందని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం ప్రతి కొన్ని నెలలకు ఒకసారి కందిపప్పు లేదా పామాయిల్‌ను విదేశాలకు ఎగుమతి చేయడానికి తహతహలాడుతోంది. ఇది ఆహార భద్రత కాదు. ఇది ఎంపిక చేసిన సమృద్ధి - రాజకీయ నాయకులు ఎదుర్కోవడానికి నిరాకరించే విధానపరమైన అసమతుల్యత. బియ్యం, గోధుమలు ఎన్నికలలో లబ్ధి చేకూరుస్తాయి, నూనెగింజలు, పప్పుధాన్యాలు ఓట్లకు హామీ ఇవ్వవు కనుక బియ్యం, గోధుమల ఉచిత పంపిణీకి పాలకులు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ అసమతుల్యత యాదృశ్చికం కాదు. ఇది భారతదేశ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) విధానంలో భాగంగా ఉంది. 23 పంటలకు ఎంఎస్‌పీ అధికారికంగా ప్రకటించినప్పటికీ, సేకరణ ఖర్చులో 70% కంటే ఎక్కువ బియ్యం, గోధుమలకు వెళుతుంది. పప్పుధాన్యాలు, నూనెగింజలు ఈ వ్యవస్థ సవతి పిల్లలుగా మారిపోయాయి. వాటి

సేకరణలో ఒక క్రమపద్ధతి ఉండదు. చాలా తక్కువగా నిల్వ చేస్తారు. ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రైవేట్ మార్కెట్లలోకి తిరిగి పంపుతారు. రైతులు వెర్రివారు కాదు, బియ్యం లేదా గోదుమలను పండిస్తే ప్రభుత్వం సేకరిస్తుందనీ, ఎంతో కొంత మద్దతు ధర ఇస్తుందని వారికి తెలుసు. అదే పప్పుధాన్యాలు, నూనె గింజలు పండిస్తే నిలకడలేని ధరలు, మద్దతు ధర లేకుండా తమతో ఆటలాడుకుంటుందని రైతులకు బాగా తెలుసు.

> పాలకుల ఆకర్షణీయ నినాదాలు, సమావేశ మందిరాల్లో వారి ప్రసంగాలకు చప్పట్లను తరిచిచూస్తే చీకటిచిత్రం బయటపడుతుంది. భారతదేశ వ్యవసాయం లోపాయికారి సేకరణ, పెరిగిన సబ్సిడీలు, అస్థిర ప్రపంచ మార్కెట్లు, వాతావరణ మార్పు చక్రంలో చిక్కుకుపోయింది. ప్రభుత్వం ప్రధాన లక్ష్యాలను నిర్ణయించడం వల్ల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ రాజకీయ దృక్పథాలు, రైతు వాస్తవాల మధ్య వైరుధ్యాల కింద కుంగిపోతున్నదనే వాస్తవం మరుగునపడిపోతోంది.

రైతులను పప్పుధాన్యాలు, నూనెగింజల వైపు మొగ్గు చూపాలని ప్రతి సంవత్సరం విధాన నిర్ణేతలు కోరుతున్నారు. అన్నదాతలు ఆ సూచనను ఏమాత్రం పట్టించుకోరు. ఎందుకంటే ప్రోత్సాహకాలు మార్పునకు వ్యతిరేకంగా ఉంటాయి. ప్రభుత్వం తన సేకరణ విధానాన్ని మార్చుకోకపోవడం, కావాల్సిన చోట డబ్బు పెట్టకపోవడమే నిజమైన వైఫల్యం తప్ప రైతుల ప్రతిఘటన కాదు. పంట ఎంపికను సేకరణ తప్పుదోవపట్టిస్తే మిగిలిన అన్నింటిని సబ్సిడీలు తప్పుదోవపట్టిస్తున్నాయి. ఒకప్పుడు భారతదేశానికి రుతుపవనాలు లాటరీలాంటివి. ఇప్పుడు వారికి ఆటలామారింది. అనూహ్యంగా, వినాశకరంగా తయారైంది. ఈ ఏడాది సెప్టెంబరు మధ్యనాటికి దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 7శాతం అధికంగా నమోదైంది. కానీ సగటు గందరగోళాన్ని దాచిపెడుతున్నది. పంజాబ్, హర్యానా రాజస్థాన్ 40 నుంచి 68% అధిక వర్షపాతంతో మునిగిపోయాయి, బీహార్, అసోం 30నుంచి 40శాతం లోటుతో ఎండిపోయాయి. లడఖ్ 400% అధిక వర్షపాతంతో అతలాకుతలమైంది. ఇప్పటికే ఈ పరిణామాలు కనిపిస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, అసోంలో వరదలకు చేతికి అందివచ్చిన పంటలు కొట్టుకుపోయాయి. కరువు వంటి పరిస్థితులు తూర్పు ప్రాంతాన్ని పీడిస్తున్నాయి. మొత్తం మీద దేశంలో రికార్డు స్థాయిలో పంట పండిందని గొప్పలు చెప్పుకోవచ్చు. వాస్తవంగా చూస్తే రైతన్న వ్యక్తిగతంగా నష్టాలు చవిచూస్తున్నాడు. అటువంటి నష్టాల నుంచి రైతన్నను బయటపడేసేందుకు ప్రధానమంత్రి పసల్ బీమా యోజన రూపొందించినట్టు పాలకులు గొప్పగా చెప్పుకుంటున్నారు. అయితే, ఆచరణలో ఇది పదేపదే విఫలమైంది. క్లెయిమ్ పరిష్కారం ఆలస్యం అవుతోంది, పంట నష్టం తక్కువ అంచనా వేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. నష్టపరిహారం కోసం రైతులు నెలలతరబడి వేచిచూస్తుండగా బీమా సంస్థలు మాత్రం కోట్లు సంపాదిస్తున్నాయి. పరిహారం సకాలంలో చెల్లిస్తామని ప్రతి సంవత్సరం మంత్రులు వాగ్దానాలు గుప్పిస్తుంటారు, వరద ప్రభావిత ప్రాంతాలలోని రైతుల చెంతకు మాత్రం ఆ పరిహారం చేరకపోవడం అత్యంత విచారకరం.

విత్తనాలు సంమృద్ధిగా ఉన్నాయని ప్రభుత్వం నొక్కి చెపుతోంది. 22.9 మిలియన్ టన్నుల విత్తనాలు అవసరం ఉండగా, 25 మిలియన్ మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని పాలకులు చెపుతున్నారు. అయితే, ఎరువుల కథ మరో విధంగా ఉంది. విత్తనాలు ఎక్కువగా నాటడంతో ఎరువులకు డిమాండ్ ఇప్పటికే పెరుగుతోంది. ఫాస్ఫేట్, పొటాషియం ఎరువుల దిగుమతి ప్రపంచ సుస్థిరతకు హానికలిగిస్తోంది. అధికారిక చానెళ్లు మూసుకుపోయినప్పుడు బ్లాక్‌మార్కెటింగ్ పెరుగుతుంది. రైతులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. ఇంకా దారుణంగా, నకిలీ విత్తనాలు వ్యాప్తి చెందుతూనే ఉన్నాయి. రాజస్థాన్‌లో నిర్వహించిన దాడుల్లో నకిలీ పురుగుమందులు, ఎరువులు బయటపడ్డాయి, కానీ అలాంటి దాడులు అడపాదడపా మాత్రమే జరుగుతాయి. పంటలు బాగా పండనప్పుడు మాత్రమే చిన్న వ్యాపారులపై దాడిచేసి నకిలీ విత్తనాలను కనుగొంటారు. అప్పటికే చాలా ఆలస్యం అయిపోతుంది. నష్టాన్ని పూర్తిగా రైతులే భరిస్తున్నారు. బ్యూరోక్రాటిక్ ముసుగులో జవాబుదారీతనం కనుమరుగైపోతోంది. "ప్రయోగశాల నుంచి భూమికి" నినాదాలను ఇష్టపడే ప్రభుత్వాలు రైతులకు నకిలీ ఇన్‌పుట్‌లు అందకుండా చూసుకోవడం అత్యంత ప్రధాన బాధ్యత. అయినప్పటికీ, ఏటికేడు ఈ సమస్య కొనసాగుతూనే ఉంది.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ గడువు దాటిపోయింది, అయినా, దాని గురించి నోరుమెదపడంలేదు. తాజా సర్వేలు వ్యవసాయ కుటుంబం సగటు నెలవారీ ఆదాయం రూ. 12,000 కంటే తక్కువగా ఉందని చూపిస్తున్నాయి. భారతదేశం ధాన్యం కొరత ఎదుర్కోవడం లేదు. రాజకీయ సంకల్పం కొరతతో బాధపడుతోంది. ఆ లోటును తీర్చే వరకు, ప్రతి రికార్డు పంట ఒక మైలురాయి కంటే తక్కువ కాదు - ఇది పురోగతికి రుజువు కాదు, కానీ విజయంగా ధరించిన విఫలమైన వ్యవసాయ ఆర్థిక శాస్త్రాన్ని దేశం ఎంత మొండిగా పట్టుకుని ఉందో దానికి నిదర్శనం.

పేదలకు అన్యాయమే

ఇది చాలా అన్యాయం. నేను సహించను. రేపే ప్రజల్లోకి వెడతా. ఈ దుర్మార్గాన్ని సహించను. ఏంటి బావ దుర్మార్గం సహించను అంటున్నావ్. నీకు తెలియదా రోజూ ఉదయమే పేపరు చదువుతావు కదా. ఒక పక్క కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు, మేధావులు గగ్గోలు పెడుతుంటే ఏమీ ఎరగనట్లు నిదానంగా ఏమిటి అంటావేమిటి. అది సరే విషయం ఏంటో చెప్పు. చెప్పడానికేముంది నా బోటి పేదల పిల్లలు డాక్టర్లు కాకూడదనేగా నేటి ప్రభుత్వ పన్నాగం. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తాడంట. ఉన్నవారి పిల్లలే వైద్య కోర్సు చదవాలంట. ఒక పక్క సంపద సృష్టిస్తానని కబుర్లు చెప్పి ప్రభుత్వ కాలేజీలు ఉన్నవారి పరంచేసి సంపద సృష్టిస్తారా. ఏమిటి అన్యాయం. ఇది నీకు కొత్తగా అన్పిస్తోందా. చంద్రబాబు ఆలోచన ఉన్నవారికి ఉపయోగపడి వారి సహాయంతో గద్దెనెక్కడమేనని అనుకుంటున్నారు. ఈ రోజు మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేయడం నాకు కొత్తగా అన్పించడంలేదు. అసలు సంపద సృష్టించి ప్రభుత్వం నడిపించే వాడయితే సంపద ఉన్నవారికి లబ్ధి చేకూర్చే పనులు చేయరు. ప్రభుత్వానికి ఆదాయం కావాలంటే



పరిశ్రమాధిపతుల నుంచి వసూలు చేయవచ్చుకదా. వారిపై పన్నులు పెంచడం, చందాల ద్వారా వసూలు చేయకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వారికి దారాదత్తం చేయడం సమంజసమేనా? గద్దె నెక్కడానికి అలవికాని సూపర్ సిక్సు లాంటి వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తరువాత ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని చేతులెత్తేస్తే ఎలా? సంక్షేమ పథకాలు నిలిపివేసి సంపద సృష్టించి తన అనుభవం, తెలివితేటలు నిరూపించవచ్చు గదా.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన దగ్గర నుంచి ప్రతిరోజు జగన్ దుర్మార్గుడని ఖజానా ఖాళీచేసి పోయాడని దుర్మార్గ పాలనలో తన వారికి దోచి పెట్టాడని తిట్టడంతో చేతులు దులుపుకుంటే ప్రజలు మెచ్చుకోరు. జగన్ అనేక తప్పులు చేసి ఉండవచ్చు. ఆ తప్పులు మీరు చేయకుండా ప్రజలు మెచ్చే ఆలోచనతో పాలన చేయవచ్చుకదా. జగన్ నవరత్నాలని పేదలను ఆకర్షిస్తే చంద్రబాబు సూపరు సిక్సు పూర్తిగా అమలు చేయకపోగా పన్నులు పెంచడంలో నిమగ్నమయ్యారు. కరెంటు చార్జీలు, బస్సు చార్జీలు లాంటివి పెంచి మధ్య తరగతి వారి నెత్తికి పెంచారు. పన్నులు పెంచకుండా అప్పులు పెంచకుండా మంచి పాలనచేస్తే బాబు తెలివితేటల గమనించి ప్రజలు హర్షం వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వానికి జేజేలు పలుకుతారు.

స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. అన్నట్లుగానే ఆగస్టు 15 న ప్రారంభించారు. కాని ఒకపక్క అప్పులు పెంచుతూ ఉచిత బస్సు పథకం అమలుపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల తరువాత ఆ పథకం వల్ల వచ్చిన కోట్ల నష్టం వంకతో ఆర్టీసీని కూడా ప్రైవేటు పరం చేస్తాడనే అనుమానం కొందరిలో ఉంది. ప్రత్యక్ష పన్నులు కాకుండా పరోక్ష పన్నులు పెంచడంలో బాబు అగ్రగణ్యుడని కొందరు వ్యాఖ్యానించినా కరెంటు చార్జీలు పెంచడం ద్వారా ప్రత్యక్షంగానే పెంచారు. ఆదాయ పన్ను శాఖ ద్వారా వేల కోట్లు సంపాదించే వారి జాబితా సంపాదించి వారికి పన్నులు పెంచి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెట్టవచ్చు. కాని ఆ పని ప్రధాని మోదీగాని, చంద్రబాబులాంటి వారుగానీ చెయ్యరు.

ఎందుకంటే ఎన్నికలకు ఫండు వారి నుంచే తీసుకుంటారు గనుక. జగన్ ఎత్తివేసిన అన్నదాన కార్యక్రమాలు బాబు మరల మొదలుపెట్టారు. పేదలకు అందే దానికంటే నడిపేవారి చేతివాటం ఎక్కువయిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అమరావతినే రాజధానిగా ఎంచుకుని అక్కడ పనుల్లో నిమగ్నమవటం ఎవరికి లబ్ధి చేకూరుతుందో తెలిసిన విషయమే. ప్రతిది ప్రభుత్వం వల్ల కాదని ప్రైవేటుపరం చేయడం ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లుగానే భావించాలి.

సెల్: 9885569394

కేరళలో ఆర్ఎస్ఎస్‌కు ఎదురుదెబ్బ

పి. శ్రీకుమారన్

కేరళలో శబరిమలై కొండపైగల ఆలయానికి సమీపంలో ప్రపంచ అయ్యప్ప సంగమం నిర్వహించడానికి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) కు అనుమతివ్వడానికి కేరళ హైకోర్టు అనుమతించింది. అయితే పంపానది ఒడ్డున ప్రపంచ అయ్యప్ప సంగమం నిర్వహించడానికి అనుమతించాలన్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల విజ్ఞప్తిని కేరళ కోర్టు అనుమతించగా రాష్ట్రప్రభుత్వం అనుమతించరాదన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుని హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోకూడదని తెలిసింది. ఈ విధంగా సుప్రీంకోర్టు హైకోర్టు అనుమతిని తిరస్కరించడం ఇది రెండవసారి. పంపానది ఒడ్డున ప్రపంచ అయ్యప్ప సంగమం నిర్వహించడం కేవలం వాణిజ్యం కోసమేనని రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. కొన్ని షరతుల మేరకు సంగమంను అనుమతిస్తూ హైకోర్టు సెప్టెంబరు 11న తాత్కాలిక ఉత్తర్వులు జారీచేసింది.

హైకోర్టు తాత్కాలికంగా అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వులో మేము జోక్యం చేసుకోవడంలేదని సుప్రీం కోర్టు తెలిపింది. ప్రపంచ అయ్యప్ప సంగమం ఉత్సవాన్ని నిర్వహించడానికి హైకోర్టు కొన్ని షరతులను విధించింది. హైకోర్టు సి.ఎస్ నరసింహ నాయకత్వంలోని ధర్మాసనం అనుమతించడానికి సంబంధించిన అన్ని ప్రశ్నలు బహిరంగంగానే ఉన్నాయని అందువల్ల ఇతర అంశాలను ప్రస్తావించవలసిన అవసరం లేదని తెలిపింది. పంపానది ఒడ్డున ఉత్సవం నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో కేరళ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. ప్రభుత్వం తరపున భక్తులైన న్యాయవాదులు విసి అజిత్‌కుమార్, టిఎస్ మహేంద్రకుమార్, అజీష్ కలథిల్ గోపిలు పిటిషన్ దాఖలుచేశారు. ప్రతికూలించిన సంగమం పూర్తిగా వాణిజ్య కార్యకలాపం.

అందువల్ల అనుమతించరాదని పిటిషనర్లు అభ్యంతరం తెలిపారు. అయ్యప్ప ఆలయానికి సమీపంలో పంపానది ఒడ్డున ఇలాంటి వాణిజ్యాన్ని నిర్వహించడం సరైందికాదని పిటిషనర్లు తెలిపారు. కేవలం సంపాదనకే సంగమం ప్రతిపాదన చేశారని పిటిషనర్లు వాదించారు. ఈ సంగమం మతం లేదా ఆధ్యాత్మిక కార్యకలాపాలతో ఏమాత్రం సంబంధం లేదని వారు తెలిపారు.

సెప్టెంబరు 20వ తేదీన సంగమం కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీడీబీ, వారి అధికారులు, ఏజంట్లను అనుమతించరాదని పిటిషనర్లలో ఒకరు సుప్రీంకోర్టును కోరారు. అలాగే సంగమం కార్యక్రమం దేవత పేరుతో నిర్వహించడానికి ఆలయం నిధులను, ఆస్తులను, సేవలను సైతం అనుమతించకూడదని ఆయన సుప్రీంకోర్టును కోరారు. తుదితీర్పునకు స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణ చేయాలనికోరగా, ఇంకా అది పెండింగ్‌లో ఉంది. ట్రావెన్‌కోర్-కొచ్చిన్ హిందు మత సంస్థల చట్టం 1950ని ఉల్లంఘిస్తూ హైకోర్టు ఉత్తర్వుజారీ చేసిందని లాయర్ మహేంద్రకుమార్ అభ్యంతరం తెలిపారు. సంగమం ప్రతిపాదనపెట్టిన వారి వాదాన్ని ఉన్నతస్థాయి కోర్టు తిరస్కరించింది. ఇది కేవలం తాత్కాలిక ఉత్తర్వు.

మేము ఎందుక జోక్యం చేసుకోవాలి? సంగమం నిర్వహణకు వారికి అధికారం ఎక్కడ ఉంది? అది నిర్వహించడం సరైందని ఎక్కడ చెప్పారు హైకోర్టు దీనిని పరిశీలిస్తుంది అని న్యాయమూర్తి నరసింహ ప్రశ్నించరు. సుప్రీంకోర్టు ఉత్తర్వు ఎల్‌డిఎఫ్ చేతిలో ఆయుధమైంది. అంతేకాదు, సుప్రీంకోర్టు ఉత్తర్వు హిందుత్వ గ్రూపునకు తీవ్రమైన దెబ్బ తగిలింది. సంగమం నిర్వహించడానికి అనుమతించేదిలేదని ప్రభుత్వం కచ్చితంగా తెలిపింది. శబరిమల భవిష్యత్తు అభివృద్ధికి ఇది ఆటంకమవుతుందని, అలాగే ప్రపంచ భక్తుల కేంద్రాన్ని ఆటంకపరుస్తుందని గతంలో ప్రభుత్వం తీసుకున్న వైఖరిని సుప్రీంకోర్టు సమర్థించినట్లయింది. సుప్రీంకోర్టు ఉత్తర్వును దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి విఎన్ వాసన్ మాట్లాడుతూ, ప్రపంచస్థాయిలో అయ్యప్ప భక్తులు వచ్చి తమ మొక్కులను తీర్చుకునేందుకు అన్ని కార్యక్రమాలను నెరవేర్చుకునేందుకు ఒక వేదిక అవుతుందని అన్నారు. శబరిమలైలో మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరచేందుకు పెట్టుబడులు పెట్టడానికి వీలు కలుగుతుందని మంత్రి అన్నారు. వివిధ దేశాల ప్రభుత్వాలు సైతం ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకువచ్చే అవకాశం ఉంటుందని భక్తుల యాత్రాకేంద్రంగా మార్చడానికి ఆయా ఆలయాల సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు వీలు కలుగుతుందని మంత్రి తెలిపారు.

టీడీబీ వజ్రోత్సవంలో భాగంగా సంగమంను నిర్వహించాలని తలపెట్టారు. ఈ ఉత్సవాలను మూడు వేదికలలో జరుపుతారు. కనీసం 3000 మందికిపైగా భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతారు. ప్రభుత్వం ఈ ప్రణాళికలను వాస్తవంగా అనుమతించినట్లయితే అంచనావేసిన దానికంటే రెట్టింపు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారని కేరళ సెక్యులర్-బహుళ నైతికతలకు చిహ్నమని మంత్రి తెలిపారు. సంఘపరివార్ గ్రూపులో చీలట్లు అలుముకున్నాయి. సంగమం నిర్వహించడం ద్వారా నిధులు సమీకరించవచ్చునన్న ఆశ సంఘపరివార్‌కు ఏర్పడింది. 2018లో శబరిమలై ఆలయంలో మహిళలుసైతం ప్రవేశించవచ్చునన్న సుప్రీంకోర్టు తీర్పునుకూడా వ్యతిరేకించిందని ప్రభుత్వం తెలిపింది. ఇప్పుడు సంగమం ఉత్సవాన్నికూడా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. దీనితో హిందుత్వ గ్రూపునకు మద్దతు, ఉత్సాహాన్ని కలుగచేయడంతో కోర్టు తీర్పు విఫలమైంది. శబరిమలైకు సంబంధించిన వ్యవహారాలలో ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని నాయర్ సర్వీసు సొసైటీ (ఎన్ఎస్ఎస్)కి ఎదురుదెబ్బ అయింది. ప్రభుత్వ వైఖరి అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి ఉత్సాహాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 20న శబరిమలై ఆలయంలో ఉత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను చేస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండగా సంఘపరివార్ ఆశలు నెరవేరలేదు.

ప్రజ్ఞాసింగ్ సహా ఏడుగురికి బాంబే హైకోర్టు నోటీసులు

ముంబై: మాలెగావ్ కేసులో బీజేపీ నేత ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ సహా నిర్దోషులుగా ప్రకటించిన ఏడుగురికి బాంబే హైకోర్టు గురువారం నోటీసులిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖడ్‌తో కూడిన ధర్మాసనం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), మహారాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ చేసింది. రెండువారాల్లోగా వాటిని అందజేయాలని ఆదేశిస్తూ... ఈ కేసు తదుపరి విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మృతుల కుటుంబసభ్యులు బాంబే హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా నిందితులందరినీ నిర్దోషులుగా విడిచిపెడుతూ 2025 జులై 31న ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు తీర్పు ఇచ్చింది. ఘటన జరిగిన 17 ఏళ్ల తర్వాత సాక్ష్యాధారాలు లేవంటూ నిందితులను విడిచిపెట్టడం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని ప్రతిపక్ష పార్టీలు సహా పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

రోగివేషంలో ఆసుపత్రికి కలెక్టర్

చెన్నై: తమిళనాడులోని పెరంబలూరు జిల్లా గోల్కానత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సాధారణ రోగి వేషంలో వెళ్లిన జిల్లా కలెక్టర్ మృణాళిని... అక్కడ ప్రజలకు ఏవిధంగా వైద్యం అందుతుందో పరిశీలించారు. ఇటీవల గోల్కానత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న ఓ మహిళ... అక్కడ చికిత్స సరిగ్గా లేదంటూ కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. ఘటన జరిగిన రోజు సాయంత్రమే... సాధారణ రోగి వేషంలో కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని నర్సుకు చెప్పగా, నర్సు ఎలాంటి పరీక్ష చేయకుండానే ఇంజక్షన్ వేసేందుకు సిద్ధమైంది. దాంతో అప్రమత్తమైన కలెక్టర్ ఇక్కడ డాక్టర్లు ఎవరూ లేరా... వారు రోగులను చూడరా అంటూ ప్రశ్నించారు. అప్పటికి ఆమెను కలెక్టర్‌గా గ్రహించిన నర్సు వణికిపోయింది. ఆ కేకలు విని ఆసుపత్రి సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. డాక్టర్ గురించి ఆరా తీయగా ఒక్కరు కూడా సమాధానం చెప్పలేకపోయారు. దీంతో రిజిస్టర్ పరిశీలించిన కలెక్టర్ దానిని సక్రమంగా నిర్వహించడం లేదని తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్సుపైనా, విధులకు గైర్హాజరైన వైద్యుడిపైనా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు.

నిశితంగా పరిశీలిస్తున్నాం

పాక్-సౌదీ రక్షణ ఒప్పందంపై భారత్

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ అరేబియా ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ కుదుర్చుకున్న వ్యూహాత్మక రక్షణ ఒప్పందంపై భారత ప్రభుత్వం స్పందించింది. ఆ ఒప్పందం ప్రభావాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించింది. పాక్ ప్రధాని సౌదీ అరేబియాలో పర్యటించారు. రియాద్‌లో యువరాజుతో ఆయన భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక, చారిత్రక సంబంధాలను, ఉమ్మడి ప్రయోజనాలకు దోహదం చేసే అంశాలను సమీక్షించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కీలక ఒప్పందం చేసుకున్నారు. రెండు దేశాల్లో దేనిపైనైనా శత్రువు దాడి జరిపితే... అది ఇద్దరిపైనా జరిగిన దాడిగా భావిస్తామని, అప్పుడు ఇరువురు ప్రత్యర్థితో పోరాడాలన్నది ఆ ఒప్పందం ఉద్దేశం. 'పాక్-సౌదీ మధ్య వ్యూహాత్మక ఒప్పందం జరిగినట్టుగా ఉన్న నివేదికలు మా దృష్టికి వచ్చాయి. దానిని మేం పరిశీలిస్తున్నాం. జాతీయ భద్రతతో పాటు ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వంపై ఈ ఒప్పందం పరిణామాలు ఎలా ఉంటాయనేదానిపై అధ్యయనం చేస్తున్నాం. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని విదేశాంగ శాఖ స్పందించింది. కొన్ని నెలల క్రితం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి బదులుగా మన బలగాలు పాక్‌లోని ఉగ్రమూకలను మట్టుపెట్టాయి. దాని తర్వాత రెండు దేశాల మధ్య కొన్నిరోజుల పాటు ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఒప్పందం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అఫ్గాన్ ఉగ్రస్థావరంగా మారకూడదు: భారత్

న్యూఢిల్లీ: లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సహా ఐరాస ప్రకటిత ఉగ్రసంస్థలు అఫ్గానిస్థాన్‌లో కార్యకలాపాలు సాగించకుండా చూడాలని ప్రపంచ దేశాలకు భారత్ పిలుపునిచ్చింది. ఆ దేశంలో భద్రతా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ వెల్లడించారు. అఫ్గానిస్థాన్‌పై ఐరాస భద్రతామండలిలో జరిగిన సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్-అఫ్గాన్ మధ్య సాంస్కృతిక బంధం ఉంది. ఘర్షణలతో దెబ్బతిన్న దేశంలో శాంతి, స్థిరత్వానికి కృషి చేసే విషయంలో భారత ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. అఫ్గాన్‌కు సంబంధించిన కీలక అంశాలపై అంతర్జాతీయంగా, ప్రాంతీయంగా ఏకాభిప్రాయం, సహకారం ఉండాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాం. ఆ దిశగా మా ప్రయత్నాలు అంతర్జాతీయ వేదికలపై ప్రతిబింబిస్తున్నాయి' అని హరీశ్ పేర్కొన్నారు. అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రితో మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రెండుసార్లు చర్చలు జరిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని ఆ దేశం తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. అఫ్గాన్‌లో ఇటీవల భారీ భూకంపం సంభవించింది. ప్రకృతి విపత్తులు, పేదరికం, వ్యాధులు, ఆహార కొరత వంటి సమస్యలతో బాధపడుతోన్న అక్కడి ప్రజలకు సాయం అందించాల్సిన సమయం ఆసన్నమైందని హరీశ్ అన్నారు. ఇటీవలి భూకంపం తర్వాత తక్షణమే స్పందించిన దేశాల్లో భారత్ కూడా ఉందని, ఆహారంతో పాటు ఔషధాలు, దుప్పట్లు, జనరేటర్లు, టెంట్లు వంటివాటిని పంపించిందని, రానున్న రోజుల్లో ఆ దేశానికి మన నుంచి మరింత సాయం అందనుందని హరీశ్ చెప్పారు.

'పామ్' హడల్

- మెదడు తినే అమీబాతో కేరళ గజగజ
- రాష్ట్రంలో 70కు పైగా కేసులు: 19 మంది మృతి

తిరువనంతపురం: కేరళ రాష్ట్రాన్ని మెదడు తినే అమీబా వణికిస్తోంది. కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఇన్‌ఫెక్షన్ సోకితే మరణాన్ని తప్పించుకోలేరన్న భయం ప్రజల్లో ఉంది. ఇప్పటికే 70కుపై కేసులు రాగా, 19 మంది ప్రాణాలు కోల్పోయారు. జ్వరం, తలనొప్పి, వాంతులు, మెడ నొప్పి, బుర్ర సరిగ్గా పనిచేయకపోవడం, మూర్ఛ రావడం, కోమాలోకి వెళ్లడం వంటి లక్షణాలు రోగుల్లో ఉంటాయి. వ్యాధి సోకిన ఒకటి లేక రెండు వారాల్లో ప్రాణాలు కోల్పోతారు. కంటికి కనిపించని పరాన్నజీవి 'నేగ్లేరియా ఫౌలెరి' సాధారణ బాషలో 'మెదడును తినే అమీబా' వల్ల ప్రైమరీ అమీబిక్ మెనింగోఎన్‌సెఫాలిటిస్ (పామ్) వస్తుంది. 2016లో మొదటి కేసు నమోదైంది. అప్పట్లో ఏడాదికి ఒకటి లేదా రెండు కేసులు వచ్చేవి కానీ ఇప్పుడు ఈ వ్యాధి ప్రాణాంతకంగా మారి కేరళను బెంబేలెత్తిస్తోంది.

1962 నుంచి ప్రపంచవ్యాప్తంగా 488 కేసులు గుర్తించినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. అమెరికా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా దేశాల్లో కేసులు ఎక్కువని తెలిపింది. వ్యాధి సోకిన 95 శాతం మంది మరణించారని బీబీసీ నివేదించింది. ఇన్‌ఫెక్షన్ సోకిన వారిలో 98 శాతం మంది చనిపోయారని తెలిపింది.

కేరళ ప్రభుత్వం ప్రకారం 'పామ్' అనేది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. బాధితులలో మూడు నెలల శిశువు నుంచి 91 ఏళ్ల వయస్సుగల వారి వరకు ఉన్నారు. గతంలో కోజికోడ్, మల్లప్పురం తదితర జిల్లాల్లోని క్లస్టర్‌లతో ముడిపడి ఉన్న ఈ వ్యాధి ఇప్పుడు రాష్ట్రమంతటా కనిపిస్తున్నది. మెదడు తినే అమీబాతో కలుషితమైన నీటి వనరులలో దిగితే ఇన్‌ఫెక్షన్ వస్తుంది. నీళ్లు మింగితే కాదు కానీ కలుషిత నీరు ముక్కులోకి వెళితే, నాసిక మార్గాల ద్వారా అమీబా మెదడుకు చేరుకొని ఒకటి లేక రెండు వారాల్లో రోగిని చంపేస్తుందని వైద్యాధికారులు తెలిపారు. వ్యాధి లక్షణాలను ఒక రోజులోనే గుర్తించవచ్చు... కొన్నిసార్లు తొమ్మిది-పది రోజులకుగానీ గుర్తించలేమని చెప్పారు. దీనిని బ్యాక్టీరియల్ మెనింగిటిస్‌గా పొరపడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కచ్చితంగా వ్యాధిని నిర్ధారించేలోగా రోగి పరిస్థితి క్షీణించి, ప్రాణాలు కాపాడటం కష్టమవుతుందని వైద్యులు అన్నారు.

కేరళలో గతేడాది నుంచి మెదడు తినే అమీబా కేసులలో పెరుగుదల నమోదైందని రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ అన్నారు. కేరళలో దాదాపు 5.5 మిలియన్ల బావులు, 55వేల చెరువులు ఉన్నాయని చెప్పారు. తమ నీటి అవసరాల కోసం ఈ బావుల నీటిని నిత్యం లక్షలాది మంది వినియోగిస్తారని,. అన్ని నీటి వనరులు శుద్ధి చేయడం కష్టసాధ్యమన్నారు. చాలా వరకు నీటి వనరుల్లో అమీబా ఉంటుంది కానీ కొన్ని రకాలే ప్రాణం తకమైనవని వీణా జార్జ్ బుధవారం అసెంబ్లీకి తెలిపారు. 2016లో మొదటి 'పామ్' కేసు రాష్ట్రంలో నమోదైందని, అప్పటి నుంచి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ వ్యాధిని నిర్ధారించే అవసరమైన పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు చండీగఢ్, పుదుచ్చేరిలో మాత్రమే ఉండేవని, ఇప్పుడు సొంత డయాగ్నొస్టిక్ కేంద్రాలను కేరళ ఏర్పాటు చేసుకుందని వీణా జార్జ్ అన్నారు. ఈ వ్యాధికి చికిత్స క్లిష్టమైనది. దీనిని ఒక్క మందు కూడా లేదు. ఇన్‌ఫెక్షన్ సోకి ప్రాణాలు దక్కించుకున్న వారు ప్రపంచంలో చాలా తక్కువ మంది ఉన్నారు' అని ఆరోగ్య నిపుణులు వెల్లడించారు. ఇందుకు నివారణే ఒక్కటే మార్గమని నొక్కిచెప్పారు. కాగా, వాతావరణంలో మార్పులతో పామ్ కేసులు మరింత పెరిగే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

అన్ని మతాలను గౌరవిస్తా

సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: అన్ని మతాలను గౌరవిస్తానని సీజేఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న విష్ణు దేవుడి విగ్రహం వివాదంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న జవారి ఆలయంలో ఏడు అడుగుల విష్ణుమూర్తి విగ్రహం ఉంది. అయితే ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, దాని స్థానంలో మరో విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సుప్రీంకోర్టులో రాకేశ్ దలాల్ అనే వ్యక్తి పిటిషన్ వేశారు. మొఘల్ రాజుల కాలంలో డ్యామేజ్ అయిన విగ్రహాన్ని తొలగించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అయితే సీజేఐ ఆ పిల్‌పై స్పందిస్తూ... ఇది నిజమైన పిల్ అని, ఏదైనా చేయమని వెళ్లి ఆ దేవుడినే అడుగు అని, విష్ణుభగవానుడికి వీర భక్తుడిని అని చెప్పుకుంటున్నావు కదా, అయితే పూజలు, ప్రార్థనలు చేయమని అన్నారు. ఆ ఆలయం పురావస్తు శాఖ ఆధీనంలో ఉందని, కొత్త విగ్రహ ప్రతిష్ఠాపనకు పురావస్తుశాఖ అనుమతి అవసరమని తెలిపారు. అయితే ఖజురహో ఆలయంపై తాను చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించారని, అన్ని మతాలను తాను గౌరవిస్తానని ఆయన చెప్పారు.

పేదలకు ఆర్థిక, భాషాపర ఇబ్బందులు

కోర్టులు, చట్టాలపై అవగాహన పొందేందుకు ఆర్థిక, భాషాపరమైన ఇబ్బందులు పేదలకు అడ్డంకులుగా ఉన్నాయని సీజేఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన 'లీగల్ అండ్ జస్టిస్ ఎడ్యుకేషన్ ఏ 2047- ఎడ్యుకేషన్ యాన్ అజెండా ఫర్ 100 ఇయర్స్ ఆఫ్ ఇండిపెండెన్స్'పై మొదటి ప్రొఫెసర్ ఎన్ఆర్. మాధవ మీనన్ స్మారక ఉపన్యాసంలో సీజేఐ ప్రసంగించారు. అణగారిన...బలహీన వర్గాల ప్రజలకు కోర్టులు, చట్టాలపై అవగాహన పొందడంలో భౌగోళిక, ఆర్థిక, భాషాపరమైన ఇబ్బందులు భయంకరమైన అడ్డంకులుగా మారాయని అన్నారు. దేశంలో అనేక ప్రాంతాల్లో, సమీప కోర్టు లేదా లీగల్ డిపార్ట్‌మెంట్ వారికి అందుబాటులో లేవని, గ్రామీణ...మారుమూల ప్రాంతాల్లో నివసించే వారికి న్యాయం పొందడంలో అంతరాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. చట్టం నిజంగా సాధికారతకు ఒక సాధనంగా ఉండాలంటే, ఈ అడ్డంకులను తొలగించడం చాలా అవసరం అని గవాయ్ తెలిపారు.

ఉత్తరాఖండ్‌ను వీడని వర్షాలు

- ముంపునకు గురైన నాలుగు గ్రామాలు
- కొండచరియలు విరిగిపడి 30 ఇళ్లు ధ్వంసం
- 14 మంది గల్లంతు: 20 మందికి గాయాలు

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌ను వర్షాలు, వరదలు వీడలేదు. ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు, మెరుపు వరదలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. గురువారం కొండచరియలు విరిగిపడి నాలుగు గ్రామాల్లో నష్టం వాటిల్లింది. 30 ఇళ్లు ధ్వంసం కాగా 14 మంది చిక్కుకుపోగా 20 మందికి గాయాలయ్యాయి.

చమోలీ గ్రామం ముంపునకు గురైంది. రాజధాని డెహ్రాడూన్‌కు 260 కిమీల దూరంలోని నందానగర్ పరిధిలోని కుంటారి లగాఫలి, కుంటారి లగాసార్పాని, సెరా, ధుర్మా గ్రామాలు నీట మునిగాయి. క్షేత్రస్థాయి పరిస్థితిని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సమీక్షించారు. నాలుగు గ్రామాల్లో నష్టం జరిగిందని, 30 ఇళ్లు, అనేక దుకాణాలు, గోశాలలు ధ్వంసం కాగా 14 మంది ఆచూకీ లేరని తెలిపారు. వేర్వేరు ఘటనల్లో 200 మందికిపైగా ప్రభావితమైనట్లు వెల్లడించారు. ఘటనాస్థలాల్లో ధామి పర్యటించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టాయని, తలకు తీవ్ర గాయమైన ఓ చిన్నారిని ఎయిమ్స్ రిశికేష్‌కు ఎయిర్‌లిఫ్ట్ చేసినట్లు సీఎం తెలిపారు. చమోలీ జిల్లా మెజిస్ట్రేట్ సందీప్ తివారీలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరాతో పాటు నెట్‌వర్క్ కనెక్టివిటీని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశాలిచ్చారు. పునరావాస కేంద్రాల్లో స్వచ్ఛమైన ఆహారం, తాగునీటితో పాటు ఇతర మౌలిక వసతులు, మందులు, వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. మోక్షా నది ఉధృతికి ధుర్మా నుంచి సెరా వరకు నేల కోతకు గురైందని, ఆరు ఇళ్లు సహా అనేక భవనాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. మేఘ విస్ఫోటనం కారణంగా డెహ్రాడూన్, దాని పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో నదులు ఉప్పొంగాయి. అనేక చోట్ల రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. పదుల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. 21 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఓట్ల చోరీపై తప్పుడు ప్రచారం: అమిత్ షా

పట్నా: ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' ఐక్యసంఘటన తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తుందని గతంలో దుష్ప్రచారం చేసిందన్నారు. బీహార్‌లోని డెహరీ ఆన్‌సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే... రాష్ట్రమంతా చొరబాటుదారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. 'బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ ఇండియా ఐక్యసంఘటన అధికారంలోకి వస్తే బీహార్ చొరబాటుదారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ-శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై అధికారిక దర్యాప్తు

పైలెట్ తండ్రి పుష్కరాజ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం 'అధికారిక దర్యాప్తు' చేపట్టాలని ఎయిర్‌ఇండియా డ్రీమ్‌లైనర్ పైలెట్లలో ఒకరైన కెప్టెన్ సుమీత్ సబర్వాల్ తండ్రి పుష్కరాజ్ సబర్వాల్ కోరారు. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సుమీత్ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారని, దీంతో మరణం గురించి ఆలోచిస్తున్నాడని నివేదిక నుండి లీకైన సమాచారం తెలిపిందని, పౌరవిమానయాన కార్యదర్శి, ఏఏఐబీ డైరెక్టర్ జనరల్‌కు రాసిన లేఖలో పుష్కరాజ్ పేర్కొన్నారు. ఈ అసత్యాలు తన ఆరోగ్యం, మానసిక స్థితిని ప్రభావితం చేశాయి. ఇవి కెప్టెన్ సబర్వాల్ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం... భారత పౌరుడికి హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కు అని ఆగస్టు 29 నాటి లేఖలో పేర్కొన్నారు. విమానం (ప్రమాదాలు, సంఘటనల దర్యాప్తు) నియమాలు, 2017లోని నిబంధన 12 ప్రకారం ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం అధికారిక విచారణకు ఆదేశించాలని పుష్కరాజ్ డిమాండ్ చేశారు. విమాన ప్రమాదానికి గురైన సమయంలో, అటువంటి దర్యాప్తు నిర్వహించడం సముచితమని అనిపిస్తే... ఆ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం అధికారిక దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఈ లేఖపై పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ, ఏఏఐబీ నుండి స్పందన రాలేదు. తన కుమారుడు మానసిక ఆరోగ్యం గురించి వస్తున్న ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. సుమిత్ విడాకులు తీసుకున్నాడని, ఇటీవల ఆయన తల్లి మరణించారని, దీంతో ఆయన జీవితంపై నిరాశ చెందారని నివేదిక పేర్కొనడాన్ని తప్పుపట్టారు. ఈ లేఖపై పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ, ఏఏఐబీ నుండి ఈ లేఖపై స్పందన రాలేదు. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా... ఒకేఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు.

శాంతి స్థాపనకు మద్దతిస్తాం

సుశీలా కార్కీకి మోదీ హామీ

న్యూఢిల్లీ: సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో అట్టుడికిన నేపాల్‌లో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీతో ఆయన గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత్ మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై... అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

నవంబర్ 30 తర్వాత సుంకాలపై అమెరికా కోత

అనంత నాగేశ్వరన్ ఆశాభావం

కోల్‌కతా: రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా విధించిన 50 శాతం సుంకాల భారం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన ఆర్థిక సలహాదారు వెంకట్రామన్ అనంత నాగేశ్వరన్ ఆశాభావం వ్యక్తంచేశారు. నవంబర్ 30 తర్వాత డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం వాటిపై కోత పెట్టే అవకాశం ఉందని చెప్పారు. అమెరికాతో వాణిజ్య చర్చలు పునఃప్రారంభమైన వేళ... ఆయన ఈ అభిప్రాయం వ్యక్తంచేశారు. కోల్‌కతాలో మర్చంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరన్ గురువారం మాట్లాడారు. 'ఈ కార్యక్రమంలో టారిఫ్‌లపై మాట్లాడేందుకు నేను కొంత సమయం తీసుకుంటాను. తొలుత విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలతో పాటు మరో 25 శాతం అదనపు సుంకాలను మనం ఊహించలేదు. రెండోసారి విధించిన 25 శాతం సుంకాలకు భౌగోళిక రాజకీయ పరిస్థితులు కారణమై ఉండొచ్చని నేను భావిస్తున్నాను. అయితే ఇటీవల పరిణామాలను గమనిస్తే... నవంబర్ 30 తర్వాత అదనపు సుంకాల భారం ఉండకపోవచ్చని అనిపిస్తోంది. నేను ఈ మాట చెప్పడానికి ఎలాంటి కారణం లేదు. కానీ నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. అదనపు సుంకాలతో పాటు ప్రతీకార సుంకాలపై రానున్న రెండు నెలల్లో స్పష్టత రావొచ్చు' అని అంచనా వేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం జరుగుతోన్న చర్చల గురించి ప్రస్తావించారు. ప్రస్తుతం భారత ఎగుమతుల విలువ 850 బిలియన్ డాలర్లుగా ఉండగా... రానున్న రోజుల్లో ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని చెప్పారు. జీడీపీలో ఎగుమతుల వాటా 25 శాతంగా ఉంది. ఇది ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను సూచిస్తోందని వెల్లడించారు.

ముఫ్తీ సహా నేతల గృహనిర్బంధం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మెహబూబా ముఫ్తీ సహా పలువురు వేర్పాటువాద నేతలపై కేంద్ర ప్రభుత్వం గురువారం గృహనిర్బంధం విధించింది. దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా హురియత్ కాన్ఫరెన్స్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఘని భట్ బుధవారం సాయంత్రం సోపోర్‌లోని తన నివాసంలో మరణించారు. భట్ మృతికి నివాళులు అర్పించేందుకు సోపోర్ వెళ్లకుండా అడ్డుకునేందుకు తనను గృహనిర్బంధంలో ఉంచారని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఎక్స్‌లో పేర్కొన్నారు. తనతో పాటు పలువురు పార్టీ నేతలపై గృహ నిర్బంధం విధించారని, ఈ చర్య జమ్మూకశ్మీర్‌లో కఠినమైన, అప్రజాస్వామిక పరిస్థితుల వాస్తవికతను బయటపెడుతోందని అన్నారు. హజ్రత్‌బాల్ దర్గాలో జరిగిన ఆకస్మిక, తీవ్రమైన ప్రజాగ్రహం ప్రత్యేక సంఘటన కాదని, ఇది ప్రజల్లో వచ్చిన తీవ్రమైన, స్పష్టమైన సందేశమని, అయితే ఈ వాస్తవాన్ని బీజేపీ ఉద్దేశపూర్వకంగానే మరుగుపరిచిందని, సంవత్సరాలుగా ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని, భావోద్వేగాలను పట్టించుకునేందుకు నిరాకరిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సోపోర్ వెళ్లకుండా తనను అడ్డుకున్నారని పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సజ్జద్ లోనె పేర్కొన్నారు. హురియత్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు మిర్వాజ్ ఉమర్ ఫరూక్ కూడా తనను గృహ నిర్బంధంలో ఉంచారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ భట్ 'జనాజా' (ఖననం) కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని కుటుంబసభ్యులను ఆదేశించడం తనకు బాధ కలిగించిందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనకుండా తనను ఇంట్లోనే బంధించారని అన్నారు.

'శబరిమల బంగారం'పై దర్యాప్తు

తిరువనంతపురం: కేరళలోని శబరిమల ఆలయంలో ద్వార పాలక విగ్రహాలపై బంగారు పూత రాగి పలకలను మరమ్మతుల కోసం పంపగా... తాజాగా ఆ రాగి పలకల నుంచి కొంత బంగారం తగ్గడంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు దర్యాప్తునకు ఆదేశించింది. 2019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఉన్న బంగారు పూత రాగి పలకలను తాపడం కోసం తొలగించారు. అప్పుడు వాటి బరువు 42.8 కిలోలు. మరమ్మతుల కోసం చెన్నైకి చెందిన సంస్థకు అప్పగించేసరికి వాటి బరువు 38.258 కిలోలకు పడిపోయింది. దాదాపు 4.54 కిలోల మేర వ్యత్యాసం వచ్చింది. ఓ భక్తుడి ద్వారా వాటిని చెన్నైకి పంపడం కూడా వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన వ్యత్యాసం అని పేర్కొంది. దీనిపై వివరణాత్మక విచారణ అవసరమని జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాస్తవానికి ఈ ద్వారపాలకుల విగ్రహాలను 1999లో 40 ఏళ్ల వారంటీతో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కేవలం ఆరేళ్లకే తాపడంలో లోపాలు తలెత్తడంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది. 2019లో ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మరమ్మతులు చర్యలు చేపట్టింది. అయితే, వారు స్పెషల్ కమిషనర్‌కు గానీ, కోర్టుకు గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ బంగారు రేకులను తొలగించడం వివాదానికి కారణమైంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది.

శశికళ సంస్థల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్: తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు శశికళకు చెందిన సంస్థల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. చెన్నై, హైదరాబాద్‌లోని 10 చోట్ల తనిఖీలు చేశారు. జీఆర్‌కే రెడ్డికి చెందిన మార్గ్ గ్రూప్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేసింది. జీఆర్‌కే రెడ్డిని శశికళకు బినామీగా అధికారులు భావిస్తున్నారు. బ్యాంకులకు రూ.200 కోట్లకు పైగా మోసం చేశారని సీబీఐ నమోదు చేసిన కేసులో ఈడీ సోదాలు చేపట్టింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదేనని జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల త్వరలో జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మార్గదర్శనంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్వీప్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి.యువతను ఓటరుగా నమోదు చేయించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేశారు. ఈ క్రమంలో గురువారం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో డా.వివేకానంద్ మాట్లాడారు. ఎన్నికలలో ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలో జులై 1, 2025 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొంటే రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛత, పారదర్శకత పెరుగుతుందనీ, జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సి.ఓ వెంకటయ్య, శోభారాణి, రిసోర్స్ పర్సన్‌లు రామలక్ష్మి, మహమ్మద్ గౌస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అఫ్లేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజ్ గర్ల్స్ భవన నిర్మాణం పనులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ మండలంలోని సోమవారం గ్రామంలో నిర్మిస్తున్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అఫ్లేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజ్ భవన నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు ఎంతవరకు పూర్తయ్యాయని ఇంకా ఎన్ని రోజులలో పూర్తవుతుందని ఏ ఏ పనులు పెండింగ్లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని సూచించారు డార్మెంటరీ తరగతి గదులు కిచెన్ టాయిలెట్స్ వంటి వాటిని ముందుగా పూర్తి చేసుకుని వినియోగించుకోవాలని ఆదేశించారు. బోడుప్పల్‌లో ప్రైవేటు బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను దసరా సెలవుల లోపు తరలించాలని ఆర్సిఓను ఆదేశించారు నిర్మాణ పనులను చేపట్టాలని అత్యవసరమైన వాటిని ముందుగా పూర్తి చేసుకుని భవనాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు మొత్తము ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు అదనంగా అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్ ఆర్.సి.ఓ నాగార్జున ప్రిన్సిపల్ మమత పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇందిరమ్మ పేస్ -3లోని పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసి అందులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలనీ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ జయ్‌రాజ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ పేస్-3 లోని పార్క్ స్థలని కాపాడి అభివృద్ధి చేయాలనీ, అటి స్థలం కబ్జాకు గురి కాకుండా అందులో ప్రజలకు ఉపయోగపడే విదంగా ఓపెన్ జీమ్ వంటివి ఏర్పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. వెంటనే పై పనులు పూర్తి చేయాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశి, యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు నిలవకుండా మాజీ కార్పోరేటర్ చర్యలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : నగరంలో కురిసిన భారీ వర్షానికి మల్కాజిగిరిలోని సరికొండ నరసింహారెడ్డి కళ్యాణ మండపం వద్ద ఉన్న నాలాలో అక్కడే ఉన్న రోజువారి డంపింగ్ యార్డు చెత్త కుప్పలు నాలాలో ఇరుక్కుపోయి వర్షపు నీరు పూర్తిగా రోడ్ మీదకు చేరి చెరువును తలపించింది. దారిన పోయే వారికి చాలా ఇబ్బంది కలగడం విషయం తెలుసుకున్న మాజీ కార్పోరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ తన అనుచర గణాన్నితీసుకువెళ్ళి నాలాలో ఇరుక్కుపోయిన చెత్తను తొలగించి నీరు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ నగర్ వాసులు ప్రదీప్, సతీష్, రాజు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

విశాలాంధ్ర - మొయినాబాద్ : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్వచ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నరసింహారెడ్డి, వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, వైభవ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, రవీందర్ యాదవ్, ప్రశాంత్ గౌడ్, కృష్ణ చారి, రాజేందర్ రెడ్డి, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆ దిశగా సంక్షేమ శాఖలో చేపట్టాల్సిన ప్రధాన కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నేతృత్వంలో గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి అధికారులు సమాయత్తం కావాలని సూచించారు. ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు తక్షణం కొత్త భవనాల నిర్మాణం, అలాగే పాత భవనాలకు మేజర్, మైనర్ మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. తాత్కాలిక అలాగే దీర్ఘకాలిక మైన ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని, విద్యార్థుల భవిష్యత్తు భద్రతకు ఇది ఒక ముందడుగని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆలోచనలు విద్యా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత, దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలనే ఆలోచనతో ఉన్నారని, వాటికి అనుగుణంగా అమలులో అధికారులు పూర్తిగా కట్టుబడి ఉండాలని సూచించారు. పరిపాలనలో ఎటువంటి గ్యాప్ లేకుండా సమర్థవంతంగా అమలు జరగాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ నిధుల విషయంలో చురుకుగా అనుసంధానం చేయాలని సూచించారు. డ్రాప్‌అవుట్ రేటు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మెంటర్‌షిప్, కౌన్సెలింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. అధిక ఫలితాలు సాధించిన గురుకులాలను మోడల్ ఇన్‌స్టిట్యూట్లుగా అభివృద్ధి చేసి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలపాలని పేర్కొన్నారు. విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్, డిజిటల్ లెర్నింగ్, టెక్నాలజీ యాక్సెస్ పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉన్నత విద్య, జాతీయ ప్రవేశ పరీక్షల (జెఈఈ, ఐఐటీ, నీట్, యూపీఎస్సీ, ఎస్ఎస్‌సి) కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు సమగ్రంగా అందేలా చూడాలని సూచించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించి, వారి అవసరాలను దృష్టిలో ఉంచి

భారీ వర్షంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జలమండలి ఎండీ, ఈడీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. ఎండీ మాట్లాడుతూ.. రానున్న 2రోజుల్లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటలవరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు, సివర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లను ఆయా డీజీఎంలు తనిఖీ చేయాలన్నారు. వర్షం కారణంగా రహదారులపై ఉన్న మ్యాన్ హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్ ఫ్లో పై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా ప్రజల ఇంటి వద్ద చోక్ అయినా సమస్య పరిష్కరించడానికి ప్రాధాన్యమివ్వాలని జీఎంలను ఆదేశించారు. లోతైన మ్యాన్ హెూళ్లు, మురుగు ఉప్పొంగే ప్రాంతాలను సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీరు సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచినీటి నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్తీలు, లోతట్టు ప్రాంతాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈడీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనిచేసే కార్మికులు పని జరిగే ప్రదేశాల్లో తప్పనిసరిగా హెల్మెట్లు, గ్లౌజులు, గమ్ బూట్స్ ధరించడంతో పాటు ఇతర రక్షణ చర్యలు పాటించేలా చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రల్ని పంపిణీ చేయాలని సూచించారు. వీటిని క్వాలిటీ వింగ్ జనరల్ మేనేజర్ ఇతర అధికారుల సమన్వయంతో పంపిణీ చేయాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలని తెలిపారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హెూల్ మూతలను తెరవకూడదని సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని వారు కోరారు.

సింగరేణి గ్లోబల్ విస్తరణ ప్రాజెక్టులకు ఎస్‌బీఐ సహకారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి గ్లోబల్ పేరుతో దేశ విదేశాల్లో చేపట్టే ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం చేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన సంసిద్ధత తెలియజేసింది. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ గురువారం ముంబయిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ ఎండి సత్యేంద్ర కుమార్ సింగ్, సీజీఎం శైలేష్ ఉన్నితన్‌లతో ప్రత్యేకంగా సమావేశమై ఈ అంశంపై చర్చించారు. సింగరేణి సంస్థ త్వరలోనే దేశ విదేశాల్లో కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించబోతోంది. ఇప్పటికే సింగరేణి సంస్థకు కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ లభించింది. దేశ విదేశాల్లో కీలక ఖనిజ అన్వేషణ ఉత్పత్తి కోసం ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అధ్యయనం జరుపుతోంది. కేంద్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి సంబంధించి అందిస్తున్న రాయితీలను వినియోగించుకుంటూ దేశంలో కూడా పెద్ద ఎత్తున కీలక ఖనిజ ఉత్పత్తికి పూనుకోవాలని నిర్ణయించింది. అలాగే పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, 5 వేల మెగావాట్ల సోలార్, థర్మల్ ప్లాంట్లు, గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తోంది" అని సీఎండీ ఎన్.బలరామ్ వివరించారు. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ త్వరలో చేపట్టనున్న భారీ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. దీనిపై ఎస్బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి సానుకూలంగా స్పందించారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఇప్పటికే సింగరేణికి ప్రధాన ఆర్థిక లావాదేవీల (లీడ్) బ్యాంకుగాను సేవలు అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ సింగరేణి అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సంస్థగా తన సత్తా చాటాలని ఆకాంక్షించారు. దశాబ్దాల కాలంగా ఎస్బీఐ సంస్థ సింగరేణితో మంచి అనుబంధం కలిగి ఉందన్నారు.ఎస్.బి.ఐతో దశాబ్దాల బంధం సింగరేణి సంస్థ దశాబ్దాల కాలంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ద్వారానే పెద్ద ఎత్తున తన ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తోంది. సింగరేణిలో ఉన్న 75% కార్మికులకు ఎస్బీఐలోనే ఖాతాలు ఉన్నాయి. అలాగే సింగరేణి ఉద్యోగుల కోసం ఎస్.బి.ఐ సంస్థ ద్వారా కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేయడం కూడా జరిగింది. భవిష్యత్ విస్తరణ ప్రాజెక్టులలోనూ భాగస్వాములు కావాల్సిందిగా, సహకారం అందించాల్సిందిగా కోరుతూ సీఎండీ ఎన్.బలరామ్ ఎస్.బి.ఐ ఉన్నతాధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించారు.

ఘనంగా బిపి మండల్ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సౌత్ సెంట్రల్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌలాలి ప్రశాంత్ నగర్ రైల్వే క్వార్టర్స్‌లో బి.పి మండల్ 107వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, నేషనల్ కమిషన్ ఫర్ బీసీ చైర్మన్ హన్స్ రాజ్ గంగారం అయిర్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, బిజెపి రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.లక్ష్మణ్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ హాజరై ప్రసంగించారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ సందర్భంగా బి.పి మండల్ ఓబీసీల సాధికారత కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ, ఆయన సేవలను కొనియాడారు. జ్యోతిరావు పూలే లాంటి మహనీయుల స్థాయిలో బి.పి మండల్ విగ్రహాలను కూడా అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవని మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉన్న లెవెల్ క్రాసింగ్ సమస్యలు మొత్తం 11 అంశాలను పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఓబీసీ ఈఏ వర్కింగ్ ప్రెసిడెంట్ మీనాక్షి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, కోశాధికారి నర్సింగ్‌రావు, ఏడిఆర్ఎం ముత్యాలనాయుడు, సిపిఏ అడ్మిన్ జి.ఎస్.రావు, సీనియర్ డిపిఓ ఆనంద్ కట్ట, బీజేపీ కార్పొరేటర్లు సునీత శేఖర్ యాదవ్, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, జెఏసి వెంకన్న, మురుగేష్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, అమీనుద్దీన్, చిన్నా యాదవ్, హేమంత్ పటేల్, సర్వేశ్ యాదవ్, నవీన్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్, మసీదు బండ ప్రభుపాద లేఔట్, సుదర్శన్ నగర్ కాలనీలలో ముంపు ప్రాంతలలో కలిగే సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతల్లో సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, పలు శాఖల సంబంధిత అధికారులతో కలసి పర్యటించి, పరిశీలించి, సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలు అందరు వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని అప్రమాత్రంగా ఉండలని, అత్యవసర పరిస్థితి తప్ప ఇంటి నుండి బయటకు రావొద్దు అని, ప్రతి ఒక్కరు కనీస స్వీయ రక్షణ చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. వాతావరణ శాఖ సూచన ల మెరకు అప్రమత్రంగా ఉండలని ఎడతెరిపి లేకుండా కురుస్తున్నా భారీ వర్షాల కారణంగా, ప్రజలు, ప్రతి కాలనీ వాసులు, తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావొద్దు అని, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిత్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ఎక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చూడాలని అధికారులకు తెలియచేసారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శిరీష, డీఇ ఆనంద్, ఏఈ భాస్కర్, ఏఈ రషీద్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, గణేష్ ముదిరాజు, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్,కోడిచెర్ల రాములు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పాదరక్షల వారసత్వం జాతీయ సదస్సు ప్రదర్శనపై

ఫ్లీచ్‌ఇండియా ఫౌండేషన్, ఎఫ్డీడీఐ మధ్య ఒప్పందం



విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఫుట్వేర్డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్‌లో (ఎఫ్డీడీఐ) నవంబర్ 28-30 తేదీలు జరుప తలపెట్టిన పాదరక్షల వారసత్వం జాతీయ సదస్సు ప్రదర్శనపై ఫ్లీచ్‌ఇండియా ఫౌండేషన్, ఎఫ్డీడీఐ మధ్య గురువారం కాజగూడలోని, ఫ్లీచ్‌ఇండియా ఫౌండేషన్ కార్యాలయంలో ఒప్పందం జరిగింది. ఒప్పంద అంగీకార పత్రాలను ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్, ఛైర్‌పర్సన్ డా. తేజస్విని యార్లగడ్డ, ఎఫ్డీడీఐ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహ తేజ్‌లోహిత్‌రెడ్డి, సంతకాలు చేసి, పత్రాలను మార్చుకున్నారు. భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసిన ఎఫ్డీడీఐ, ఫ్లీచ్‌ఇండియా ఫౌండేషన్స్ సంయుక్తంగా నిర్వహించే ఈసదస్సులో పాదరక్షల వారసత్వంపై దేశవిదేశాల నుంచి వచ్చే డిజైన్స్ డెవలప్మెంట్‌ని నిపుణుల చర్చ, 'మీచెప్పులు మీరే కుట్టుకోండి' అనే కార్యశాల, ప్రత్యేక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పాదరక్షలు తయారీలో సంప్రదాయ నైపుణ్యంపై చక్కటి అవగాహన కలిగించే ఈసదస్సు, ఈరంగంలోని డిజైన్ నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు, వారసత్వ ప్రేమికులుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఫ్లీచ్‌ఇండియా ఫౌండేషన్, సీఈఓ, డైరెక్టర్లు డా.ఈమని శివనాగిరెడ్డి, డా. సనాతన, ఎఫ్డీడీఐ, శాకాధిపతి అబ్దుల్ రెహమాన్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - మొయినాబాద్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో రూ. 5లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులను టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సిసి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, గ్రామ ప్రత్యేకాధికారి అహ్మద్, చేవెళ్ల నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు నిరంజన్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌరీ రవి, బుచ్చయ్య, ఎల్లయ్య, కృష్ణ, మల్లేష్, గణేష్, రాజేష్, కుమ్మరి సురేష్, అంజి, మల్లారెడ్డి, సంపత్, శ్రీకాంత్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ లో మరోసారి భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3 రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కుంభవృష్టి పడుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అత్వసరమైతేనే లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న ప్రాంతాల్లో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఎక్కడ ఇబ్బందులు ఉన్న వెంటనే స్పందించాలని తెలిపారు. మ్యాన్ హెూల్ వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడైనా రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉండి సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే హైదరాబాద్ కలెక్టరేట్ హెల్ప్ లైన్ నెం 9063423979 అలాగే జిహెచ్ఎంసి హెల్ప్ లైన్ నెం. 040 2111 1111 లకు కాల్ చేసి సమస్యలు తెలపాలని అలాగే అన్ని బృందాలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు.

మంత్రి జూపల్లి కృష్ణరావుకు సిపిఐ నేతల సన్మానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య కళారూపాల వర్క్ షాప్ ను ప్రారంభించేందుకు హైదరాబాద్, హిమాయత్ నగర్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ కు విచ్చేసిన వచ్చిన రాష్ట్ర పర్యాటక, అబ్కారీ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావుకు సన్మానించారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, సమితి సభ్యులు మరుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అభివృద్ధి నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడలో 10 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం పనులను ఆమె గురువారం సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయానికి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, పార్టీ నేతలు కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇండ్కల్ టెక్నాలజీస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇండ్కల్ టెక్నాలజీస్, భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలలో ఒకటి. తన బ్రాండ్ వోబుల్ డిస్ప్లేల వృద్ధిని వేగవంతం చేయడానికి సిరీస్ బి బ్రిడ్జ్ రౌండ్ ఫండింగ్లో 20 మిలియన్ డాలర్లను సేకరించింది. ప్రస్తుత పెట్టుబడిదారుల మద్దతుతో స్మార్ట్ టెక్నాలజీలలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, టెలివిజన్లు డిస్ప్లేలలో ఆవిష్కరణలకు ముందంజను ఇస్తూ, బలమైన ఆర్ అండ్ డి అభివృద్ధి సామర్థ్యాల కారణంగా విప్లవాత్మక పరిష్కారాలను అందిస్తుంది. ఈ ఫండింగ్ గురించి వ్యాఖ్యానిస్తూ ఆనంద్ దూబే, సిఇఒ, ఇండ్కల్ టెక్నాలజీస్ ఇలా అన్నారు. వోబుల్ డిస్ప్లేలతో మా ప్రయాణంలో ఈ రౌండ్ ఒక కీలక మైలురాయన్నారు. ఈ పెట్టుబడి భారతదేశం నుండి ప్రపంచ స్థాయి నాణ్యమైన ప్రదర్శన సాంకేతిక బ్రాండ్‌ను నిర్మించాలన్న మా దృష్టిని ధృవీకరించడమే కాకుండా, ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి, మా సేవా పర్యావరణ వ్యవస్థను విస్తరించడానికి, భారతీయ వినియోగదారులకు గృహ వినోదం, వ్యాపార వినియోగాన్ని పునర్నిర్వచించే ఉత్పత్తులను రూపొందించడానికి వ్యూహాత్మక ప్రేరణనిస్తుందని తెలిపారు. ఇందులో పాల్గొనే పెట్టుబడిదారుల నుండి వచ్చిన ఈ కొత్త పెట్టుబడుల ప్రవాహం మాకు సంతోషాన్ని ఇస్తోందని, వారి దీర్ఘకాలిక దృష్టిపై నమ్మకం వోబుల్ డిస్ప్లేస్ 'వృద్ధి' తదుపరి దశలోకి నడిపిస్తుందని పేర్కొన్నారు.

మేడారం జాతర మాస్టర్ ప్లాన్ సిద్ధం

మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కుంభమేళాగా పిలుచుకొనే మేడారం జాతరకు సంబంధించి ఆదివాసీ గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ఆధునీకరణ, భక్తులకు సౌకర్యాలు వంటి ప్రాధాన్యతా అంశాలతో కూడిన మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపు ఇవ్వడం జరిగిందని వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం లభించిన వెంటనే ఆధునీకరణ పనులు ప్రారంభించి వందరోజుల్లోగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. దేశం నలుమూలల నుంచి మేడారం మహాజాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన దర్శనం, ఇతర సౌకర్యాలు లభించే విధంగా అంగుళం తేడా లేకుండా శాస్త్రోపకరంగా సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనలు, సలహాలను ప్రతి అంశంలోనూ పరిగణనలోకి తీసుకొని మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందని తెలిపారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలోరాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించారు. గద్దెలను అభివృద్ధి డిజైన్ సమ్మక్క సారలమ్మ ప్రధాన ద్వారం డిజైన్ , ప్రహారీగోడ నిర్మాణానికి అవసరమైన రాతి డిజైన్ గద్దెల అభివృద్ధి తర్వాత అదనంగా ఎంత విస్తీర్ణం పెరుగుతుంది వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను రెండు రోజుల్లో సమర్పించాలని మాస్టర్ ప్లాన్ తయారుచేసిన కన్సల్టెన్సీని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు స్వయంగా మేడారం వెళ్లి అక్కడి పూజారులు, స్థానిక ప్రజల అందరి అభిప్రాయాలను తీసుకొని గద్దెల డిజైన్ తయారు చేయడం జరిగిందన్నారు. గతంలో భక్తులకు క్యూలైన్ల వలన పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం సరిగా లభించేదికాదు. మహాజాతర సమయంలో ఇది భక్తులకు ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు భక్తుల సౌకర్యార్థం గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి గాంచిందని, ఇది గిరిజన సంప్రదాయ రీతికి దర్పణం పడుతుందని తమ కష్టాలను కడతేర్చే కలియుగ దైవాలుగా, వనదేవతలుగా సమ్మక్క సారలమ్మలను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారని తెలిపారు. సమ్మక్క సారలమ్మల త్యాగం, ఔన్నత్యం మరింత చాటి చెప్పేలా ఆలయ ప్రాంగణం రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మేడారం ఆలయం తో పాటు ఆ పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - కాప్రా : నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలలో అభివృద్ధి చేపట్టి ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్సీ బస్తి, ఓల్డ్ మల్లాపూర్, ఎస్వీ నగర్ కాలనీల్లో 70 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పై అధికారులతో మాట్లాడి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో రోడ్లు, మంచినీటి సమస్య, వీధి దీపాలు వంటి అనేక సౌకర్యాలను ప్రజలకు కల్పించేందుకు ఉన్నంత అధికారులతో కలిసి నిధులను మంజూరు చేయించి పనులు చేస్తున్నానని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డి ఈ రూపా, ఏ ఈ శ్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ భిక్షపతి, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన ఎన్‌విఎస్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వి.ఎస్.రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంకి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి తగు సలహాలు ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి ఎన్.వి.ఎస్. రెడ్డికి సూచించారు.

శాఖాపరమైన సమస్యలు నా దృష్టికి తీసుకురండి : మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇటీవల ఎన్నికైన ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రుల నివాస సముదాయంలోనీ తన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ పూర్తి పారదర్శకతో ఏ శాఖలో లేని విధంగా రోడ్లు భవనాలు శాఖలో ప్రమోషన్స్ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి ఆర్ అండ్ బి శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్ అప్రూవల్ చేసుకొని రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చేలా కృషి చేశానన్నారు. తనను కలిసి వినతులు ఇచ్చినప్పుడు మీకు తప్పకుండా శాఖ పరమైన ప్రమోషన్స్ వచ్చేలా చేస్తానని చెప్పానని, ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి 118 మంది ఏఈఈ లు డి.ఈ లుగా ప్రమోషన్స్ పొందారని, అట్లాగే 72మంది డి.ఈ లు ఈ.ఈ లుగా, 29 మంది ఈ.ఈ లు ఎస్.ఈలు, ఎస్.ఈ లు సి.ఈ లుగా 6గురు, సి.ఈ నుండి ఈఎన్సి గా ఇద్దరు ప్రమోషన్స్ పొందారని గుర్తు చేశారు. శాఖలో సమూల మార్పులు తీసుకువచ్చి మీరు అడిగినవన్ని చేస్తున్నది,మరింత ఉత్సాహంతో పని చేస్తారనే నమ్మకంతోనే అని మంత్రి స్పష్టం చేశారు. మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ శాఖ బలోపేతంపై దృష్టి పెట్టి అదే స్థాయిలో పని చేసేందుకు కృషి చేయాలని, శాఖపరమైన ఆమోదయోగ్యమైన సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇతర కేడర్లలో మిగిలిన పదోన్నతులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖ కు మంచి పేరు తీసుకువచ్చే బాధ్యత శాఖ ఇంజనీర్ల పైనే ఉందని..ఆ గురుతర బాధ్యతను గుర్తెరిగి ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలని మంత్రి వారికి హితబోధ చేశారు. "మీరు ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన తర్వాతనే మా సమస్యలు పరిష్కారమై, రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చాయని" మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి అసోసియేషన్ తరుపున తమ అభిమానాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు. మంత్రిని కలసిన వారిలో ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్.శ్రీను, జనరల్ సెక్రటరీ బి.రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. శరత్ చంద్ర, ట్రెజరర్ మహేందర్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు కె.సంధ్య, వేణు, ప్రదీప్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలు నవీన్, కిషన్, అరుణ్ రెడ్డి పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు దసరాలోపు మంచినీళ్ళు అందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లా రెడ్డి, మాజీమేయర్ జక్క వెంకట్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ కార్పొరేటర్లు, ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి కమిషనర్ త్రిలేశ్వర్‌రావును కోరారు. మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ లోగ ప్రజలకు మంచినీళ్లు అందించాలని అవసరమైన చోట నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, సిసి రోడ్డు, డ్రైనేజి వంటి మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. కమీషనర్ సానుకూలంగా స్పందంచారని అన్ని పనులకు టెండర్ వేశారని, మన సమస్యలు అన్ని ముందే అంచనా వేశారని దసరా లోపు అన్ని పనులు పూర్తి చేస్తారని తనదైన శైలిలో అన్నారు. మాజీ కార్పొరేటర్లు దొంతురి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్, జిలాని పాషా, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, అమర్ పటేల్, బత్తుల కిరణ్ వివిధ కాలనీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : నిరుపేదలు వైద్యం కోసం లక్షలు వెచ్చించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వారికి అండగా నిలబడుతుంది ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలానికి చెందిన రూ.15 లక్షల విలువైన 48 చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకూడదన్న ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ, సీఎం సహాయనిధి కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందో ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్ల శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, దర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ ఆర్.బి.ఆర్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిధులుగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు, రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్, సేవా పక్షం కన్వీనర్స్, డివిజన్ అధ్యక్షులు, మహిళా మోర్చా యువమోర్చా నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ సేవాపక్షంలో భాగంగా పెద్దఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నియోజకవర్గ నాయకులను అభినందించారు. మోదీ గొప్ప నాయకులు మాత్రమే కాదు దేశ ప్రజలందరికీ ఒక మార్గదర్శి అని, దేశ ప్రజల కోసం ఎన్నో సంస్కరణలు, సంక్షేమ పథకాలు, తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తూ, యువత అన్ని రంగాల్లోనూ రాణించాలని, దేశానికి యువత వెన్నెముక లాంటి వారిని, మోదీ స్ఫూర్తితో దేశ అభివృద్ధిలో, అభ్యున్నతిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ అంజిరెడ్డి గారు మాట్లాడుతూ మన ప్రియతమ ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఇంత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా మంచి విషయం అని అన్నారు, రక్తదానం వల్ల మనం ఒక ప్రాణం కాపాడిన వాళ్ళమవుతాం అని అన్నారు. ఒక్క మనిషి మాత్రమే చేయగలిగిన సాయం రాక్తదానం అని, సంవత్సరంలో రెండు సార్లు రాక్తదానం చేయడం వలన ఆరోగ్యానికి మంచిదన్నారు. పక్షం కన్వీనర్ రాధాకృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, రవీందర్‌రావు, నరేష్, రాఘవేంద్రరావు, వసంత్ యాదవ్, స్రవంతి అనిల్ గౌడ్, కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, మాణిక్ రావు, పట్టాభిరామ్ మొదలగు వారు పాల్గొన్నారు.

ప్రారంభం కానున్న నూతన భూగర్భ డ్రైనేజీ పనులు

విశాలాంధ్ర - కాప్రా : బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ జామా మస్జీద్ వద్ద గత పది సంవత్సరాల నుండి ఎదుర్కొంటున్న సమస్య శాశ్వత పరిష్కారం కానుంది. సుప్రీమ్ టైలర్స్ నుండి జమ మస్జీద్ ముందుగా స్ట్రీట్ నెంబర్ 6 లోని నూతన బాక్స్ డ్రెన్ వరకు 10లక్షల వ్యయంతో నూతన భూగర్భ డ్రైనేజీ పనులు అతిత్వరలో ప్రారంభం కానునట్లు గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలియజేసారు. ఎన్నో సంవత్సరాల నుండి ఎదుర్కొంటున్న సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిష్కారం అవ్వడంతో స్థానికులు వర్షం వ్యక్తం చేసి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, తెలంగాణ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పిఎస్ఎన్ చౌదరి, ఎండి.మన్నన్, ఎండి.పాషా, ఎం డి.రషీద్, యాదగిరి, శ్రీశైలం, వెంకటేష్ గౌడ్, ఎం డి.నదీమ్ తదితర స్థానికులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ కాలనీలో కమాన్ ప్రారంభించిన వజ్రేష్

విశాలాంధ్ర - మేడిపల్లి:బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ లో మాజీ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్ యాదవ్ సొంత నిధులతో జ్యోతినగర్ కాలనీలో గురువారం కమాన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొని ప్రారంబించారు. బి బ్లాక్ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఆర్టియే మెంబెర్ జైపాల్ రెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్, కుంభం కిరణ్ రెడ్డి, సుమన్ నాయక్, బింగి జంగయ్య యాదవ్, జక్కా రాములు, సీసా వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తా

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: పాఠశాలకు అవసర మైన సదుపాయాలను ఏర్పాటు చేయుటలో తప్పకుండా తనవంతూ సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరుక్ నగర్ మండలం వెల్జర్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పర్యటించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న నీటి సమస్యను ఎమ్మెల్సి నవీన్ రెడ్డికి వివరించారు. పాఠశాల యాజమాన్యం గ్రామస్తులు, సమస్యను విన్న నవీన్ రెడ్డి వీలైనంత త్వరగా విద్యార్థులకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తానని పాఠశాల యాజమాన్యానికి విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అదే సందర్భంలో వెల్ జర్ల గ్రామానికి గ్రామానికి చెందిన అనిమి పద్మమ్మ, తుప్పరి శివకుమార్, టి రమేష్, బైండ్ల జంగమ్మలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వెల్జర్ల స్థానిక నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, అలాగే నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శివరాజ్, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్, రెడ్డి, శేఖర్ రెడ్డి, సర్పంచ్ భూపాల్ రెడ్డి, ఈశ్వర్ రాజు నాయకులు, నాగిళ్ళ వెంకటేష్, డాక్టర్ రవీందర్, సంతోష్ నాయక్ రఘు గౌడ్, యాదగిరి, లక్ష్మయ్య యాదయ్య, మహేష్, వెంకటేష్, సందీప్, శ్రీశైలం, సత్తి రెడ్డి, యుగంధర్, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ముంపు బెడద నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను కాంగ్రెస్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి బాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం అకాల వర్షం కారణంగా, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి బైరన్ చెరువుకి భారీగా వరద రావడంతో చెరువు పక్కన ఉన్న కాలనీలను, కాంగ్రెస్ పార్టీ ఎన్ ఎంసి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి బాల్‌రెడ్డితో కలిసి పర్యటించారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఎన్ ఎంసి కమిషనర్, హైడ్రా కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి సమాచారం అందజేసి ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోలన్ బాల్ రెడ్డి, గొంగుల జిత్తు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ అయోధ్య నగర్ కాలనీలో 45 లక్షల నిధులతో నూతన సిసి రోడ్డుకు గురువారం ఉదయం శంకుస్థాపన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ బ్రదర్స్‌లో దసరా ఆఫర్లు



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: దసరా నవరాత్రుల సందర్భంగా స్పాట్ గిఫ్ట్‌తో స్వాగతం పలుకుతున్న ఆర్.ఎస్. బ్రదర్స్ రిటైల్ ప్రత్యేక బ్రాండ్ సృష్టించుకున్న ఆర్.ఎస్. బ్రదర్స్ వారు 'దసరా బ్లాక్ బస్టర్ స్పాట్ గిఫ్ట్' పేరుతో కొనుగోలుదారులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నారు. రూ.2,000 విలువ చేసే ప్రతీ కొనుగోలుపై విశేషమైన కానుకలను అందిస్తున్నారు. కొద్దిరోజులకు మాత్రమే పరిమితమైన ఈ మహత్తర అవకాశంలో భాగంగా రూ.4495 ఖరీదైన స్వర్ణ పట్టుచీరను కొన్నవారికి కేవలం రూ.45 లకే మరో చీరను కానుకగా అందజేస్తున్నారు. అదేవిధంగా రూ.4995 ఖరీదు చేసే పట్టు చీరను కొన్నవారికి మిక్సీగ్రైండర్లు కానుకగా ఇస్తున్నారు. ఇదే కోవలో లేడీస్ వెస్టన్ వెల్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ అనేక రకాల ఆకర్షణీయమైన కానుకలు కొనుగోలుదారులకు తక్షణ కానుకలుగా అప్పటికప్పుడు అక్కడికక్కడ ఆర్.ఎస్. బ్రదర్స్ వారి షోరూమ్స్ లభిస్తున్నాయి. ఆకర్షణీయమైన డిజైన్లు సరికొత్త వెరైటీలతో పండుగ కలెక్షన్, సరసమైన ధరలతో అద్భుతమైన ఆఫర్స్, స్పాట్ గిఫ్టులు దసరా వేడుకల కోసం పెద్ద ఎత్తున షాపింగ్ చేస్తున్న వారిని ఈ కానుకలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

వేగంగా విస్తరిస్తున్న భారత్ నిర్మాణ రంగం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : భారత్ నిర్మాణ రంగం వేగంగా విస్తరిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ నిర్మాణ రంగం 12శాతం వృద్ధితో దూసుకుపోతుందన్నారు. హైదరాబాద్‌లోని హయత్ ప్యాలస్‌లో ప్రముఖ బీ2బీ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా ప్రత్యేక మీడియా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో 'వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా 2025' 11వ ఎడిషన్‌కు నాంది పలికారు. ఈ ప్రధాన ఎక్స్‌పో అక్టోబర్ 8 నుంచి 10 వ తేదీ వరకు ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుంది. ఇందులో 250 పైగా ఎగ్జిబిటర్లు, 350 పైగా బ్రాండ్లు, 15,000 పైగా ఇండస్ట్రీ నిపుణులు నిర్మాణం, మౌలిక సదుపాయాల రంగాల నుంచి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగం ఈ రౌండ్టేబుల్‌కు సరైన వేదికగా నిలుస్తున్నాయన్నారు. పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలు, నిపుణులు మార్కెట్ ధోరణులపై చర్చించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా సీనియర్ గ్రూప్ డైరెక్టర్ రజనీష్ ఖట్టర్ మాట్లాడుతూ భారతదేశం నిర్మాణ రంగంలో తన పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. సమగ్రతతో కూడిన సుస్థిరమైన మౌలిక సదుపాయాలను నిర్మించే గ్లోబల్ సూపర్ పవర్‌గా భారత్ అవతరించుతోందని చెప్పారు. మా వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా ఎక్స్‌పో 2025 ఈ దిశలో సంపూర్ణ సమన్వయంతో ఉందని చెప్పారు. జిందాల్ పాంథర్ సిమెంట్ సీఈఓ రోహిత్ వోరా, కన్సల్టెంట్, ఆర్కిటెక్ట్ డాక్టర్ ఈఆర్. ఏఆర్ ఎస్వీ అంచూరి, సీఈపిఐ వైస్ ప్రెసిడెంట్ సోమనాథ్ ఘోష్, నివేత ఆర్, బిర్లా ఎన్యూ ఇన్నోవేషన్, ప్రణవ్ దేశాయ్ పాల్గొన్నారు.

సాయిబాబా నగర్‌లో స్వచ్ఛభారత్

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు సేవ పక్వాడ్ కార్యక్రమం మైలారదేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యంలో సాయిబాబా నగర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్ర నగర్ నియోజక వర్గ బీజేపీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లీన్ ఇండియాను సాధించాలన్న సంకల్పంతో 2014 అక్టోబరు 2న భారత ప్రధాని నరేంద్ర మోదీ 'స్వచ్ఛ భారత్'కు శ్రీకారం చుట్టారని బహిరంగ మలవిసర్జనను అరికట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రచారాన్ని చేపట్టారన్నారు. నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలకు కానుకగా మైలార్దేవ్‌పల్లి డివిజన్‌ని స్వచ్ మైలార్ దేవ్ పల్లిగా తీర్చిదిద్దుకోవాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని తెలియజేయడం జరిగింది. మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికి జనార్ధన్ సంతు గౌడ్, రావుల భాస్కర్, వెంకటరమణ, నవారు మురళీధర్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, మధు సుధన్ రెడ్డి బొమ్మరాజు నరసింహ అడికి రాజు శ్రీకాంత్ రెడ్డి వినయ్ రెడ్డి గోపాల్ నాయక్ శేఖర్ రామారావు, ప్రభుదాస్ కురుమయ్య, శంకర్ జిహెచ్ఎంసి జవాన్ శేఖర్ ఎస్ఎఫ్ఏ ప్రకాష్ పాల్గొన్నారు.

బిఎస్ఎఫ్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: సెప్టెంబర్ 28న బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బిఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే బిఎస్ఎఫ్ 19వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ పిలుపునిచ్చారు. బిఎస్ఎఫ్ 19వ ఆవిర్భావ కరపత్రాన్ని గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఏంఎస్ఎఫ్ ఆల్ యూనివర్సిటీస్ జాతీయ కోఆర్డినేటర్ పల్లెర్ల సుధాకర్, ఓయూ జెఏసి నాయకులు మిడతలపల్లి విజయ్ చేతుల మీదుగా బిఎస్ఎఫ్ 19వ ఆవిర్భావ దినోత్సవ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 28న ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో బిఎస్ఎఫ్ జెండావిష్కరణ జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరవుతారని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బిఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. బిఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ ఇంచార్జ్ కల్వకుర్తి శ్రీశైలం, రాష్ట్ర కోఆర్డినేటర్ చెవుల కిషన్, రాష్ట్ర నాయకులు ఆరెకంటి శ్రీకాంత్, అన్నెపాక గోపాల్, ఫయాజ్, మహేష్, నరేందర్నాయక్, తేజ, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావు మరణం సాహిత్య రంగానికి తీరని లోటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు మరణం సాహిత్య రంగానికి తీరని లోటు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎస్వీ రామారావు మృతికి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా శ్రీరంగాపూర్ గ్రామంలో జన్మించిన ఆచార్య ఎస్వీ రామారావు పరిశోధకునిగా, రచయితగా, విమర్శకునిగా, పరిశోధనలకు మార్గదర్శకునిగా అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. 19 పీహెచ్ డీ, 15 ఎం.ఫిల్ పరిశోధనలకు మార్గనిర్దేశం చేసిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్‌గా, సెంట్రల్ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, బెనారస్ యూనివర్సిటీ, బెంగళూరు యూనివర్సిటీ వంటి ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఎందరో పరిశోధనా విద్యార్థులను తీర్చిదిద్దారని గుర్తుచేశారు. పాఠ్య గ్రంథాల రూపకల్పనలో, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో చెరగని ముద్ర వేసిన ఎస్వీ రామారావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ఈ విపత్కర సమయాన్ని అధిగమించే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కవిత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు.

బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : సిపిఐ రాజేంద్రనగర్ మండల సమితి గురువారం రాజేంద్ర నగర్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డిని కలిసిన సిపిఐ నాయకులు చింతల్ మెట్ సులేమాన్‌నగర్‌లో బస్తీ దవఖాన ఏర్పాటు చేయాలనీ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఏ రియాజ్ జిల్లా సమితి సభ్యులు జే ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్, చింతల్ మెట్ కార్యదర్శి ఎండి కాజా, సిపిఐ మండల కార్యాలయం కార్యదర్శి జి.సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు సదానంద్ గౌడ్, ఖలీల్ తదితరులు కలిశారు.

టూరిజం ప్రైవేట్‌పరం సరికాదు

- ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగుల ఆందోళన
- రోడ్డున పడ్డ వందలాది ఉద్యోగులు, కార్మికులు
- ఐక్య ఉద్యమాలు తప్పవు
- పర్యాటక ఉద్యోగుల నిరసనలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: పర్యాటకులకు వివిధ ప్రకృతి అందాలు, ఆనందం, ఆహ్లాదాన్ని అందించే పర్యాటకరంగాన్ని కూడా వదిలిపెట్టకుండా ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ టూరిజంలోని 20 హోటళ్ల ప్రైవేటీకరణకు నిరసనగా ఏఐటీయూసీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో గురువారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో కె.రామకృష్ణ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు టూరిజం అభివృద్ధికి దోహదపడ్డాయని, చిన్నచిన్న సమస్యలు మినహా ఉద్యోగులు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం ఉందని, ఉద్యోగ సంఘ నాయకులను పిలిచి... సమస్యలు తెలుసుకుని ఉద్యోగులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల విలువగల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం టూరిజం వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని స్పష్టం చేశారు. ప్రైవేట్ హోటళ్ల వద్ద కనీసం పార్కింగ్, ఇతర సౌకర్యాలు ఉండటం లేదన్నారు. హోటళ్లను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించడంతో ఉద్యోగులకు, కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని, ఉద్యోగ భద్రత కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. మంచి వాతావరణాన్ని పర్యాటకులకు అందించే టూరిజాన్ని సమీక్షించి... అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా టూరిజంలో దాదాపుగా 25 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న వందలాది ఉద్యోగుల హక్కులను హరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం చంద్రబాబును కొంతమంది తప్పుదారిలో నడిపిస్తున్నారని, దీంతో పలు నిర్ణయాలు ప్రజలకు, ఉద్యోగులకు ఆటంకంగా మారుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, టూరిజం, విశాఖ ఉక్కు, ఆర్టీసీ వంటి వ్యవస్థలను ప్రైవేట్‌పరం చేసి... కేవలం అమరావతి రాజధాని నిర్మించడం వలన ప్రజలకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి... నారాయణ, చైతన్య, గీతం, విజ్ఞాన్, భాష్యం వంటి ప్రైవేట్ విద్యాసంస్థలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం ద్వారా పేదలు, మధ్యతరగతికి వైద్య విద్యను దూరం చేస్తున్న దుర్మార్గపు నిర్ణయాలతో రాష్ట్రాన్ని అథోగతి పాలుచేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక సమస్యలపై కలిసి పోరాటం చేశామని, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం సరికాదన్నారు. మతతత్వాన్ని పెంచిపోషించే బీజేపీ అనుకూల పాలన సాగిస్తూ తొలి ప్రధాని నెహ్రూను కూడా విమర్శించే హక్కు చంద్రబాబుకు లేదని, నెహ్రూ దూరదృష్టితో నిర్మించిన భారీ నీటి ప్రాజెక్టులతోనే 146 కోట్ల మంది ప్రజలు అన్నం తింటున్న విషయాన్ని విస్మరించరాదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ద్వారా వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి అవకాశాలు లభించాయని, అటువంటి విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తుంటే చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు అండగా ఉంటామని, వివిధ పార్టీలను, ప్రజాసంఘాలను ఏకంచేసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ టూరిజంలో భాగమైన హోటళ్ల ప్రైవేటీకరణతో ఉద్యోగులు, కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. ఉద్యోగులకు నష్టం కలిగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, జీవో 23ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పలు రూపాల్లో ఉద్యమాలు చేయడం వల్ల అనేక సమస్యలు పరిష్కరించుకున్నామని, ఆ స్ఫూర్తితో ఉద్యోగులందరూ ఐక్యతతో పోరాడితే ప్రభుత్వాలు దిగిరాకతప్పదన్నారు. ఉద్యోగులు, కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ధర్నాలో సంఘం నాయకులు ప్రసాద్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు: పవన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశవ్యాప్తంగా అమలుకానున్న జీఎస్టీ 2.0 సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేస్తాయని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేరేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరిస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శాసనసభలో జీఎస్టీ 2.0పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ "ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెస్తున్న ఈ సంస్కరణలు దేశ ఆర్థికవృద్ధికి, పరిశ్రమల విస్తరణకు దోహదం చేస్తాయి" అని పేర్కొన్నారు. పేదల కొనుగోలు శక్తి పెరిగి, కొత్త పరిశ్రమలు రావడానికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి జీఎస్టీ 2.0 తోడ్పడుతుందని వివరించారు. సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఈ సంస్కరణల విజయవంతమైన అమలుకు రాష్ట్రం సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఎన్నికల ప్రక్రియ నాశనానికే ఈసీ కుట్రలు: ప్రియాంక

వయనాడ్: ఎన్నికల విధానం నాశనానికి, ప్రజాస్వామ్యాన్ని సవాల్ చేసేలా ఎన్నికలు సంఘం కుట్రలు చేస్తుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల ఓట్ల తొలగింపు కోసం సంస్థాగత కసరత్తు జరుగుతుందన్న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో ఏకీభవించారు. రాహుల్ అన్ని వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారని, ఆయన చెప్పేది వింటే దేశంలో అసలేం జరుగుతోందన్నది అర్థమవుతుందని ప్రజలకు సూచించారు. ప్రియాంక గురువారం కేరళ, వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈసీ తీరును ఆక్షేపించారు. ఓట్ల చోరీ ఆరోపణ మాత్రమే కాదని, రాహుల్ అన్ని ఆధారాలు చూపారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, దేశాన్ని పరిరక్షించుకోవడం కోసం పోరాడదామంటూ ప్రియాంక పిలుపునిచ్చారు. ఇదిలావుంటే, ఎన్నికల సంఘం స్వతంత్ర వ్యవస్థగా కాక, కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో వ్యవస్థగా ఉందని కర్నాటక మంత్రి రామలింగా రెడ్డి విమర్శించారు. కాగా, కర్నాటక సీఐడీ ఓటర్ల మోసాలపై దర్యాప్తునకు ఎన్నికల సంఘం సహకరించడం లేదని, ఓట్ల దొంగలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కాపాడుతున్నారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు.

గట్టిగా నిలదీయండి

సభ్యులకు జగన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ సభ్యులకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శాసనమండలిలో బలం ఉందని, సభ్యులు గట్టిగా నిలబడాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షం లేకుండా ఉండాలని కోరుకుంటోందని, అందుకే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాజీ సీఎం భేటీ అయ్యారు. శాసనసభ, మండలి సమావేశాలలో అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఇంత తక్కువ వ్యవధిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రావడం ఇదే మొదటిసారిగా చెప్పారు. ఈ ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని విమర్శించారు. శాసనసభలో మాట్లాడేందుకు తమకు తగిన సమయం కేటాయించడం ఇష్టం లేకనే, వైసీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడంలేదని జగన్ వ్యాఖ్యానించారు. ఒక ఎమ్మెల్యేకు మాత్రమే ఇచ్చే సమయంలో ప్రజా సమస్యలు ఎలా ప్రస్తావిస్తామని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మెటీరియల్ సిద్ధంగా ఉందని, సభలో మాట్లాడనివ్వడం లేదు కాబట్టే వెళ్లడంలేదని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏడు త్రైమాసికాలు పెండింగ్ ఉందని, రూ.4900 కోట్ల బకాయి పేరుకుందని జగన్ వెల్లడించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించి పేదలకు వైద్య విద్య అందకుండా చేశారని, వ్యవసాయ రంగ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఎక్కడికక్కడ దోపిడి సాగుతోందని, అన్నింటా విఫలమైనా నిస్సిగ్గుగా సూపర్‌హిట్ అని చెప్పుకుంటున్నారని విమర్శించారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 50 ఏళ్లు నిండిన వారందరికీ రూ.4 వేల పింఛన్ లేదని, పథకాలు మారాయని, ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదని జగన్ విమర్శించారు.

ఇళ్ల స్థలాల రద్దుకు అధికారం ఎవరిచ్చారు?

'మీకు అధికారం ఇచ్చింది పేదలపై కత్తికట్టడానికా? వారి సొంతింటి కలలను నాశనం చేయడానికా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి పేదలకు ఇవ్వడం తెలియదు... వారికి అందేవి కూడా రద్దు చేస్తుందని విమర్శించారు. పేదల వ్యతిరేక పాలన రాష్ట్రంలో సాగుతోందని 'ఎక్స్'లో దుయ్యబట్టారు. 'పేద అక్కచెల్లెమ్మలకు రిజిస్ట్రేషన్ చేసిమరీ ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? వాళ్లు ఇళ్లు కట్టుకునేలా అండగా నిలబడాల్సింది పోయి, మా హయాంలో ఇచ్చిన స్థలాలను లాక్కుంటారా?' అని నిలదీశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అని జగన్ డిమాండ్ చేశారు.

సెన్సార్‌షిప్‌కు దారితీస్తాయి

అదానీపై కంటెంట్ తొలగింపు ఉత్తర్వులపై ఎడిటర్స్ గిల్డ్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) సంబంధించిన 138కుపైగా వీడియోలు,83 పోస్టులను ఐదు రోజుల్లోగా తొలగించాలని జర్నలిస్టులు, కంటెక్ట్ క్రియేటర్లకు ఐటీ శాఖ, దిల్లీ కోర్టు ఆదేశాలపై ఎడిటర్స్ గిల్డ్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కార్పొరేట్లకు కొమ్ముకాసేలా తాజా ఉత్తర్వులు ఉన్నాయని గురువారం ఒక ప్రకటన చేసింది. కార్పొరేట్ సంస్థకు పరువు నష్టం కలిగించే ఏదైనా కంటెంట్‌కు సంబంధించిన యూఆర్‌ఎల్‌లను, లింక్‌లను మధ్యవర్తులు లేదా ప్రభుత్వ సంస్థలకు పంపడానికి, ఆ తర్వాత 36 గంటల్లోపు అటువంటి కంటెంట్‌ను తొలగించాలని ఆయా వర్గాలను ఆదేశించే అధికారాన్ని తాజా ఉత్తర్వులు ఇస్తుండటం మరింతగా ఆందోళన కలిగిస్తోందని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది. ఐటీ శాఖ వ్యవహారం కూడా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించింది. ఈ విధంగా అధికారాలను విస్తరించడంతో ప్రైవేటు కార్పొరేషన్‌కు వారి వ్యవహారాలకు సంబంధించి పరువు నష్టం కలిగించే కంటెంట్ ఏమిటో నిర్ణయించే అధికారాలు ఇచ్చినట్లేనని పేర్కొంది. ఈ పరిణామాలు సెన్సార్‌షిప్‌కు దారితీస్తాయని హెచ్చరించింది. స్వేచ్ఛాయుతమైన, నిర్భయమైన పత్రికా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని నొక్కిచెప్పింది. ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వ చర్యలు ఉంటే అసంతృప్తిని ఏకపక్షంగా అణచివేయడం, ప్రజల సమాచార హక్కుకు భంగం కలిగించడమే అవుతుందని ఎడిటర్స్ గిల్డ్ స్పష్టంచేసింది. కాగా, అదానీపై 200కుపైగా వీడియోలు, పోస్టులను తొలగించడం కోసం తనతో పాటు ఇతర యూట్యూబర్లకు 36 గంటల సమయం ఇచ్చారని, ఉత్తర్వులను సవాల్ చేసే అవకాశం కూడా తమకు ఇవ్వలేదని 'దేశ్‌భక్త్' ఛానల్ నడిపే ఆకాశ్ బెనర్జీ తెలిపారు.

ఒడిశా ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాసం

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజే బీజేపీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ఆ పార్టీ నాయకుడు రామచంద్ర కదం నాయకత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ కార్యదర్శి సత్యవ్రత రౌత్‌ను కలిసి 15 నెలల బీజేపీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు నియమం 117 (1) కింద అనుమతి కోరారు. 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక సీపీఎం ఎమ్మెల్యే సంతకాలతో పిటిషన్ అందజేశారు. అనంతరం కదం విలేకరులతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షమైన బీజూ జనతా దళ్ (బీజేడీ)ని కోరినప్పటికీ సరైన స్పందన లభించకపోవడంతో తాము సొంతంగా ముందడుగు వేశామని చెప్పారు. తమతో కలిసి రావాలని ప్రాంతీయ పార్టీలను కోరారు. బీజేడీ వేరుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని భావిస్తే మద్దతు ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రతిపక్ష నాయకుడి చాంబర్‌కు వెళ్లగా, నవీన్ పట్నాయక్ లేకపోవడంతో ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో చర్చించారు. తాజా పరిణామంపై బీజేడీ నేత ప్రమీలా మాలిక్ స్పందించారు. కాంగ్రెస్ ఇంకా తమను సంప్రదించలేదని చెప్పారు. వాళ్లు చేయాలనుకున్నది చేయనివ్వండి... బీజేడీ సొంత నిర్ణయాలు తీసుకోగలదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని, మహిళలకు భద్రత కల్పించలేకపోతోందని, శాంతి భద్రతల నిర్వహణ సమస్యగా మారిందని, రైతులు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు అభద్రతా భావంతో బిక్కుబిక్కు మంటున్నారని కదం వెల్లడించారు. అవిశ్వాస తీర్మానం విషయంలో బీజేడీ కలిసి రావాలన్నారు. విడిగా ఆ పనిని చేసినా తమకు అభ్యంతరం లేదని, బేషరతుగా మద్దతు ఇస్తామని కదం చెప్పారు. ఇదిలావుంటే, కాంగ్రెస్ ఈ చర్యతో నవ్వుల పాలవుతుందని బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ్ మిశ్రా విమర్శించారు. కాంగ్రెస్‌కు సంఖ్యాబలమే లేదని, ఇది వృథా ప్రయాస అంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా కోసం బీజేడీ, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయన్నారు. కాగా, 147 మంది సభ్యులు ఉన్న అసెంబ్లీలో బీజేపీకి 78 మంది, బీజేడీకి 50 మంది, కాంగ్రెస్‌కు 14 మంది, సీపీఎంకు ఒకరు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

ఆలయాల వద్ద విషాద ఘటనలకు నాదే బాధ్యత

దేవాదాయ మంత్రి ఆనం రాజీనామాకు వైసీపీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుపతి, సింహాచలం దేవాలయాల వద్ద విషాదకర సంఘటనలు దురదృష్టకరమని... ఇందుకు తనతోపాటు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మండలి ప్రశ్నోత్తరాల్లో వైసీపీ సభ్యులు పి.రామసుబ్బారెడ్డి, వరుదు కల్యాణి, భరత్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఆనం ఈ మేరకు సమాధానమివ్వగా... దానిపై సంతృప్తి చెందని వైసీపీ సభ్యులు తీవ్ర నిరసనకు దిగారు. అనంతరం గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు అనేకం ఉన్నాయని, వైసీపీ సభ్యులు బాధపడబోమంటే...వాటిని వివరిస్తానని ఆనం బదులిచ్చారు. దీంతో ప్రతిపక్షనేత బొత్సతోపాటు ఇతర సభ్యులు జోక్యం చేసుకుని..అవి మంచిగా లేకుంటే తాము చేసే వ్యాఖ్యలకు మంత్రి బాధపడకూడదని బదులిచ్చారు. ఇంతలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తిరుపతి, సింహాచలం దేవాలయాల వద్ద జరిగిన విషాద ఘటనలకు మంత్రి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించారని, దీనికి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరుపక్షాల సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరడంతో సభను వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక గత ప్రభుత్వంలో అనేక దేవాలయాల్లో విగ్రహాలపై జరిగిన దాడుల సంఘటనలను మంత్రి ఆనం వివరిం చారు. ముందు వైసీపీ సభ్యులంతా రాజీ నామా చేస్తే...తానూ రాజీనామా చేస్తానని ప్రకటించారు. దీంతో వైసీపీ సభ్యులు నిరసన తెలుపుతూ వాకౌట్ చేశారు.

– 50 ఏళ్ల పెన్షన్ పథకంపై వైసీపీ సభ్యులు రాజగొల్ల రమేశ్ యాదవ్, భరత్, కవురు శ్రీనివాస్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఎంఎస్ఎంఈ కొండపల్లి శ్రీనివాస్ బదులిస్తూ... 50-59 వయసు మధ్య ఉన్నవారు..11,98,501 మంది పెన్షన్ పొందుతున్నారని, ప్రతినెలా ఒకటో తేదీన పేదలకు ఇస్తున్నామని వెల్లడించారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్లను రూ.3 వేల నుంచి 4 వేలకు ఒకేసారి పెంచామని, అర్హులకు ఎక్కడా పెన్షన్లు తొలగించలేదని స్పష్టంచేశారు. పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే భార్యకు స్పౌజ్ పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ మాట్లాడుతూ తాము అడిగిన ప్రశ్నకు సమాధానం లేదని, అసలు 50 ఏళ్ల పెన్షన్‌కు సంబంధించి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఎంతెంత మంది అర్హులు?, వారి లెక్కలు తీశారా? అంటూ ప్రశ్నించగా...దానిపై మంత్రి సమాధానం దాటవేశారు.

బాధ్యతారహితంగా మంత్రుల జవాబులు: బొత్స

శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు వేసిన ప్రశ్నలకు మంత్రులు బాధ్యతారహితంగా సమాధానాలు వచ్చాయని శాసన మండలిలో వైసీపీ ప్రతిపక్ష నేతల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... 50ఏళ్లకే పెన్షన్ అన్నారని, అదే అడిగితే దానికి సమాధానం లేదన్నారు. మద్యం విక్రయాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు డొంకతిరుగుడు జవాబులు తగదని చెప్పారు. కల్తీ మద్యం, బెల్ట్ షాప్‌ల విషయంలోనూ అదే అర్థం లేని మాటలు చెప్పారన్నారు. తిరుపతి, సింహాచలం దేవస్థానాల్లో జరిగిన రెండు దుర్ఘటనల గురించి అడిగితే సూటిగా సమాధానం చెప్పలేదని విమర్శించారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాకౌట్ చేశామని తెలిపారు.

మహారాష్ట్ర వైద్యుల 24 గంటల సమ్మె

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ఉపసంహరణకు డిమాండ్

ముంబై: మహారాష్ట్ర వైద్యులు సమ్మె చేశారు. రాష్ట్ర వైద్య మండలిలో మోడరన్ ఫార్మకాలజీలో కోర్సులు చేసిన వారు హోమియోపతి వైద్యులుగా నమోదు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం వెనక్కు తీసుకోవాలన్న డిమాండ్‌తో 1.8 లక్షల మంది అలోపతి వైద్యులు గురువారం 24 గంటల సమ్మె చేపట్టారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు సమ్మెలో పాల్గొన్నట్లు ఐఎంఏ మహారాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంతోశ్ కదం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వైద్య సేవల నాణ్యతను తగ్గించడమే కాకుండా రోగుల భద్రతకు ప్రమాదకరమని వైద్యుల సంఘం హెచ్చరించింది. మోడరన్ ఫార్మకాలజీ (సీసీఎంపీ)లో ఏడాది సర్టిఫికేట్ కోర్సు చేసిన వారు హోమియోపతి వైద్యులుగా నమోదు చేసుకునేందుకు, కొన్నిసార్లు రోగులకు అలోపతి మందులు ఇచ్చేందుకు అనుమతించేలా ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో మహారాష్ట్ర వైద్య మండలి (ఎంఎంసీ)కి ఆదేశాలిచ్చింది. దీంతో ఐఎంఏ మహారాష్ట్ర సభ్యులు జులై 11న సమ్మెకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిసి రోగుల్లో ఉన్న గందరగోళాన్ని వివరించారు. దీంతో ఆ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఐఎంఏ సభ్యులు కూడా సమ్మెను విరమించుకున్నారు. తాజాగా రిజిస్ట్రేట్ ప్రక్రియను పున:ప్రారంభిస్తూ ఈనెల 5న ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అలోపతి వైద్యులు మండిపడ్డారు. 24 గంటల సమ్మె చేపట్టారు. సమ్మెలో ప్రభుత్వ ఆసుపత్రులు, బ్రిహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ కాలేజిలు, ది ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ స్టేట్ మెడికల్ ఇంటర్న్స్, ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేషన్‌ల రెసిడెంట్ వైద్యులు పాల్గొన్నారు.

వదలని వాన

మరో నాలుగు రోజులు వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వర్షాలు ఇప్పట్లో ఆగేలా కానరావడం లేదు. గురువారం కూడా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా, ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉన్న నేపథ్యంలో రానున్న నాలుగు రోజులు కూడా దక్షిణకోస్తా, రాయలసీమలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సముద్ర, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం సాయంత్రం 5 గంటల నాటికి అత్యధికంగా తిరుపతి జిల్లా మల్లంలో 70 మి.మీ, కాకినాడ జిల్లా ఇంజరంలో 58 మి.మీ, తిరుపతి జిల్లా కోటలో 52.7 మి.మీ, ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 52.2 మి.మీ, యర్రగొండపాలెంలో 49.7 మి.మీ, చిత్తూరు జిల్లా దామోదర మహారాజపురంలో 49 మి.మీ, కోనసీమ జిల్లా ఈతకోటలో 47 మి.మీ వర్షపాతం నమోదైందని విపత్తుల శాఖ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. వచ్చే నాలుగు రోజుల్లో ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు,నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుబి కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు.

సీఐడీ హోంగార్డు పరీక్షా ఫలితాల వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నేర పరిశోధన విభాగం హోంగార్డుల పరీక్షా ఫలితాలను ఏపీ సీఐడీ కార్యాలయం గురువారం విడుదల చేసింది. ఈ పోస్టులకు జులై 27 నుంచి 29 వరకు అమరావతిలోని వీఐటీలో నైపుణ్య పరీక్ష నిర్వహించినట్లు ఓ ప్రకటనలో వివరించారు. 5,657 మంది దరఖాస్తు చేసుకోగా 4,223 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపింది. వీరిలో 76 మంది 35 శాతానికిపైగా ఎక్కువ మార్కులు సాధించడం ద్వారా అర్హత సాధించారని పేర్కొంది. వీరంతా డ్రైవింగ్ నైపుణ్య పరీక్ష ఫేజ్-4కు అర్హులని, దీనిని వీలైనంత త్వరగా షెడ్యూలు చేయాలని తెలిపింది. అర్హత సాధించిన అభ్యర్థులు https://citizen.appolice.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

జ్యుడిషియల్ కస్టడీకి లలిత్ మోదీ సోదరుడు

న్యూఢిల్లీ: అత్యాచారం కేసులో వ్యాపారవేత్త లలిత్ మోదీ సోదరుడు సమీర్ మోదీని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశాలకు వెళ్తున్న ఆయనను దిల్లీ ఎయిర్‌పోర్టులో అదనపు తీసుకున్నారు. కోర్టు ముందు హాజరుపరచగా సమీర్‌కు ఒకరోజు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఈనెల 19న మరోసారి కోర్టు ముందుర ఆయనను హాజరు పర్చనున్నారు. గతంలో సమీర్‌తో సహజీవనం చేసిన మహిళ ఫిర్యాదు మేరకు సౌత్ ఈస్ట్ దిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. రాజీ కోసం ఆమె రూ.50 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఐపీఎల్‌కు బాస్‌గా కోట్లాది రూపాయలు దుర్వినియోగించిన ఆరోపణలతో లలిత్ మోదీ 2010లో లండన్‌కు వెళ్లిపోయి, అక్కడే ఉంటున్నాడు. ఆయనను స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయతిస్తుంది.

సైన్యంలో బంధుప్రీతి ఉండదు

సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్



రాంచీ: సైన్యంలో బంధుప్రీతి ఉండదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. దేశానికి సేవ చేయాలంటే సైన్యంలో చేరాలని చిన్నారులకు సూచించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పౌరులను రక్షించేందుకు సైన్యం కృషి చేస్తుందని అన్నారు. 'బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యం. దేశంతో పాటు ప్రపంచాన్ని అన్వేషించాలంటే త్రివిధ దళాల్లో చేరాలని లక్ష్యం పెట్టుకోవాలి. ఇక్కడ కష్టపడితే గుర్తింపు వస్తుంది' అని జనరల్ చౌహాన్ తెలిపారు. మే 7న అర్ధరాత్రి శత్రు స్థావరాలపై దాడులు చేశామని, ఒంటి గంటకు తొలి దాడి జరిగిందని ఆపరేషన్ సిందూర్ గురించి చెప్పారు. సుదీర్ఘ లక్ష్యాలపై రాత్రి వేళల్లో దాడులు చేయాలంటే ప్రత్యేక కృషి అవసరమని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.